


# నంది పత్రిక

మా కలం - సామాన్యుడి బలం

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 254 | సోమవారం 21 - 09 -2026 | పేజీలు : 12 | వెల-3


## దేశవ్యాప్త బ్యాంకుల సమ్మె.. ఖాతాదారులకు ఎస్‌బీఐ కీలక సూచన



## ఎల్ నినో ప్రభావం, ప్రభుత్వ కార్యాచరణపై

# సీఎం చంద్రబాబు సమీక్ష

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలు, కార్యాచరణ ప్రణాళిక అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, ఆర్ఎస్కే సిబ్బందితో ఆయన టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎల్ నినో వంటి విపత్కర పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడం, మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరగకుండా నియంత్రించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని ఆయన స్పష్టం చేశారు. ఈ విపత్తును ఒక సవాలుగా స్వీకరించి, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, "ఎల్ నినో పరిస్థితులను మనం ముందుగానే అంచనా వేశాం. దీనికోసం సిద్ధం చేసుకున్న యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రతి ఒక్కరూ పనిచేయాలి. ఎల్ నినో ప్రభావం కేవలం రైతులపైనే కాదు, అన్ని వ్యవస్థలపైనా పడుతుంది. కాబట్టి రైతులను కాపాడుకుంటూనే, వినియోగదారులపై ధరల భారం పడకుండా చూడటం మన బాధ్యత" అని అన్నారు. బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు వంటి నిత్యావసరాల ధరలను కచ్చితంగా అదుపులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. గోదాముల్లోని బియ్యం నిల్వలను మార్కెట్‌లోకి విడుదల చేసి, ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉల్లి కొరతను అధిగమించేందుకు ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడంతో పాటు, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా ఉల్లి సాగును ప్రోత్సహించాలని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను వివరిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా 50.7 శాతం లోటు వర్షపాతం నమోదైందని, ముఖ్యంగా ప్రకాశం, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో 30.84 లక్షల హెక్టార్లకు

- రైతులను ఆదుకోవడం, నిత్యావసరాల ధరల నియంత్రణే ప్రధాన లక్ష్యం
- బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు ధరలు అదుపులో ఉంచాలని ఆదేశం
- డిమాండ్‌కు తగిన పంటల సాగు, వర్షాధార వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచన
- విపత్తును ఎదుర్కొనేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం

2లో



## ఏపీలో దసరా సెలవులు..



- ఏపీలో విద్యార్థులకు కలిసొచ్చిన దసరా సెలవులు
- అక్టోబరు 12 నుంచి 21 వరకు సెలవులు
- అక్టోబర్ 10 రెండో శనివారం, 11వ తేదీ ఆదివారం
- దాంతో ముందే ప్రారంభం కానున్న సెలవుల సందడి

2లో

## మోదీని అనుకరించిన రాహుల్ గాంధీ.. ఇది దిగజారుడు రాజకీయమన్న బీజేపీ

- ఇండోర్ సభలో ప్రధాని మోదీని మిమిక్రీ చేసిన రాహుల్ గాంధీ
- రాహుల్ తీరుపై బీజేపీ నేతల తీవ్ర ఆగ్రహం, విమర్శలు
- వృద్ధులను, తల్లులను రాహుల్ అవమానించారని బీజేపీ ఆరోపణ
- రాజకీయ గౌరవానికి రాహుల్ మచ్చ తెచ్చారన్న ఉత్తరాఖండ్ సీఎం
- దేశ ప్రయోజనాల కోసమే ప్రధాని పనిచేయాలని రాహుల్ హితవు



## వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది.. నమ్మొద్దు:

### డీఎస్సీ స్పోర్ట్స్ కోటా టీచర్ల విజ్ఞప్తి


- విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిన 370 మంది ఉపాధ్యాయులు
- ప్రతిభ, పతకాలతోనే ఉద్యోగాలు సాధించామని స్పష్టీకరణ
- స్పోర్ట్స్ కోటాను 3 శాతానికి పెంచిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు
- గాయాల కన్నా ఆరోపణలే ఎక్కువ బాధిస్తున్నాయని ఉపాధ్యాయుల ఆవేదన

2లో

మెగా డీఎస్సీ ద్వారా స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన తమ నియామకాలపై వైసీపీ ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తోందని పలువురు ఉపాధ్యాయులు తీవ్రంగా



## బెంగళూరులో 'ది ఎర్త్ సెంటర్' ప్రారంభోత్సవం.. హాజరైన సీఎం చంద్రబాబు



- వైట్‌ఫీల్డ్‌లో 'ది ఎర్త్ సెంటర్' ప్రారంభోత్సవం
- 9 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక కమర్షియల్ భవనం
- ప్రకృతితో మమేకమయ్యేలా 'బయోఫిలిక్ డిజైన్'తో ప్రత్యేక నిర్మాణం
- కార్యక్రమం అనంతరం బెంగళూరులోనే బస చేసి, రేపు కుప్పం పర్యటనకు వెళ్లనున్న సీఎం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం బెంగళూరులో పర్యటించారు. నగరంలోని ప్రముఖ ఐటీ హబ్ అయిన వైట్‌ఫీల్డ్‌లో అత్యాధునికంగా నిర్మించిన 'ది ఎర్త్ సెంటర్' అనే కమర్షియల్ ఆఫీస్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక సీఎం డీకే శివకుమార్ కూడా హాజరయ్యారు. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ 'విస్టా స్పేసెస్' ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసిందిఈ భవనాన్ని సుమారు 9 లక్షల చదరపు అడుగుల భారీ విస్తీర్ణంలో, 2 బేస్‌మెంట్లు, గ్రౌండ్ ఫ్లోర్‌తో కలిపి మొత్తం 8 అంతస్తులతో నిర్మించారు. కేవలం కాంక్రీట్ భవనంలా కాకుండా, ఉద్యోగులు

# అమరావతి కోసం విశాఖను దెబ్బతీస్తున్నారు

- అమరావతి ప్రయోజనాల కోసమే విశాఖను నిర్లక్ష్యం చేస్తున్నారన్న వైసీపీ
- మంత్రి నారా లోకేశ్ బంధువులపై తీవ్ర భూకబ్జా ఆరోపణలు
- స్థానిక ఎన్నికల కోసమే ఇళ్ల పట్టాల పంపిణీ డ్రామా అని విమర్శ



# పశ్చిమాసియాలో టెన్షన్..

## తమ పౌరులకు అమెరికా కీలక హెచ్చరిక



- సౌదీపై హౌతీ తిరుగుబాటుదారుల దాడుల నేపథ్యంలో కీలక హెచ్చరిక
- పశ్చిమాసియా ప్రయాణాలపై అమెరికా తన పౌరులకు కొత్త అడ్వైజరీ జారీ
- పరిస్థితి ఏ క్షణమైనా తీవ్రరూపం దాల్చవచ్చని ఆందోళన వ్యక్తం చేసిన యూఎస్
- రియాద్ సహా కీలక నగరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు జరిగాయని వెల్లడి

# సత్యప్రసాద్ వాంగ్మూలంపై జగన్ ఎందుకు స్పందించడంలేదు?

- గత వైసీపీ ప్రభుత్వ మద్యం విధానంపై మంత్రి పార్థసారథి తీవ్ర ఆరోపణలు
- రూ.3,200 కోట్ల మద్యం కుంభకోణంపై జగన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్
- కీలక అధికారి సత్యప్రసాద్ వాంగ్మూలంతో కుంభకోణం గుట్టు రట్టయిందని వెల్లడి
- డిజిటల్ చెల్లింపులు రద్దు చేసి నగదు లావాదేవీలతో భారీ అవినీతికి పాల్పడ్డారని ఆరోపణ
- కూటమి ప్రభుత్వంలో పారదర్శక మద్యం విధానం అమలు చేస్తున్నామని స్పష్టీకరణ



గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన మద్యం విధానం ద్వారా వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడటమే కాకుండా, విషతుల్యమైన మద్యాన్ని అమ్మి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రంగా ధ్వజమెత్తారు. రూ. 3,200 కోట్ల భారీ మద్యం కుంభకోణంపై, కీలక అధికారి సత్యప్రసాద్ వెల్లడించిన అంశాలపై గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పి తీరాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ అక్రమాలను, దోపిడీని తీవ్రంగా ఎండగట్టారు. వైసీపీ పాలనలో వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసి, అధికారులను ఒత్తిడికి గురిచేసి అక్రమాలకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు.

**రూ. 3,200 కోట్ల ముడుపులు ఎవరివి?** మద్యం విధానంలో భాగంగా సుమారు రూ. 3,200 కోట్ల ముడుపులు చేతులు మారినట్లు రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఓఎస్డీ సత్యప్రసాద్ కోర్టుకు ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారని మంత్రి పార్థసారథి తెలిపారు.

## బెంగళూరులో 'ది ఎర్త్ సెంటర్' ప్రారంభోత్సవం.. హాజరైన సీఎం చంద్రబాబు

ప్రకృతితో మమేకమై పనిచేసే వాతావరణాన్ని కల్పించేలా 'బయోఫిలిక్ డిజైన్' శైలిలో దీన్ని రూపొందించడం ప్రధాన ఆకర్షణ. ఈ డిజైన్ ఉద్యోగుల మానసిక ఉల్లాసాన్ని, ఉత్పాదకతను పెంచడానికి దోహదపడుతుంది. వీవర్క్, ది ఎగ్జిక్యూటివ్ సెంటర్ వంటి ప్రముఖ ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేస్ ప్రొవైడర్లు ఇక్కడ తమ ప్రీమియం ఆఫీస్ సేవలను అందిస్తున్నాయి. వైట్‌ఫీల్డ్‌లోని కేఐఏడీబీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ ఇండస్ట్రియల్ ఏరియాలో జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం, సీఎం చంద్రబాబు ఈ రాత్రికి బెంగళూరులోనే బస చేయనున్నారు. సోమవారం ఉదయం ఇక్కడి నుంచే నేరుగా తన సొంత నియోజకవర్గమైన కుప్పం పర్యటనకు ఆయన బయలుదేరి వెళతారు.

# అమరావతి కోసం విశాఖను దెబ్బతీస్తున్నారు

అమరావతికి పెద్దపీట వేయడం కోసమే టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖపట్నం అభివృద్ధిని ఉద్దేశపూర్వకంగా దెబ్బతీస్తోందని వైసీపీ నేత గుడివాడ అమర్నాథ్ ధ్వజమెత్తారు. స్థానిక సమస్యలను గాలికొదిలి, కేవలం ప్రతిపక్షంపై తప్పుడు ప్రచారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ధ్వజమెత్తారు.విశాఖలో మీడియాతో మాట్లాడిన అమర్నాథ్, ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని వేదికలనూ వైసీపీని, పార్టీ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడానికే వాడుకుంటున్నారని విమర్శించారు. తన రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ అయిన అమరావతిని ప్రమోట్ చేసుకోవడం కోసమే చంద్రబాబు విశాఖను చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. "నగరంలో తీవ్రమైన తాగునీటి ఎద్దడి నెలకొన్నా, కనీస దిద్దుబాటు చర్యలు చేపట్టలేదు. ఇది విశాఖ అభివృద్ధిని నిలిపివేయాలనే ఉద్దేశపూర్వక కుట్రలో భాగమే" అని ఆయన అన్నారు.జగన్ 1.30 లక్షల ఇళ్ల పట్టాలు ఇస్తే, కూటమి ప్రభుత్వం ఆ పనులను నిలిపివేసిందని అమర్నాథ్ గుర్తుచేశారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇళ్ల పట్టాల పంపిణీ పేరుతో డ్రామా ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. విశాఖలో అత్యంత విలువైన భూములను తమకు కావాల్సిన వారికి, ముఖ్యంగా ఎక్కడినుంచో పుట్టుకొచ్చిన రియల్ ఎస్టేట్ కంపెనీలకు చౌకగా కట్టబెట్టారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ భూదోపిడీలో మంత్రి నారా లోకేశ్ తోడల్లుడు, స్థానిక ఎంపీ కూడా భాగస్వామిగా ఉన్నారని ఆరోపించారు. ంజలాశయాలన్నీ ఎండిపోయి, ప్రజలు తాగునీటి కోసం ఎదురుచూస్తుంటే, సీఎం చంద్రబాబు ఆ సమస్య గురించి మాట్లాడకుండా వైసీపీపై విమర్శలు చేయడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమని వ్యంగ్యం ప్రదర్శించారు. చంద్రబాబు ఈవెంట్ మేనేజ్‌మెంట్‌తో ప్రజలు విసిగిపోయారని, ప్రధాన సమస్యలను పరిష్కరించకుండా జ్యోతిష్యాలు చెబుతూ కాలం గడుపుతున్నారని అమర్నాథ్ విమర్శించారు. పంచ ధారల జోన్‌లో అక్రమ మైనింగ్‌ను వైసీపీనే అడ్డుకుందని, భవిష్యత్తులో కూడా ప్రజల సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## పశ్చిమాసియాలో టెన్షన్.. తమ పౌరులకు అమెరికా కీలక హెచ్చరిక

యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాపై క్షిపణి, డ్రోన్ దాడులు చేస్తున్న నేపథ్యంలో అమెరికా అప్రమత్తమైంది. పశ్చిమాసియాలో భద్రతా పరిస్థితులు సంక్లిష్టంగా ఉన్నాయని, ఏ క్షణంలోనైనా ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చవచ్చని హెచ్చరిస్తూ.. తన పౌరులకు కొత్త ట్రావెల్ అడ్వైజరీని జారీ చేసింది. ఈ ప్రాంతంలో ఉన్నవారు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, ప్రయాణాలు పెట్టుకోవాలనుకునే వారు తమ నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని స్పష్టం చేసింది.అమెరికా విదేశాంగ శాఖ (స్టేట్ డిపార్ట్‌మెంట్) ఈ హెచ్చరికను విడుదల చేసింది. ఇప్పటికే పశ్చిమాసియాలో ఉన్న అమెరికన్లు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, విమానాలు రద్దు కావడం, గగనతలాలు మూసివేయడం వంటి ప్రయాణ అంతరాయాలకు సిద్ధంగా ఉండాలని సూచించింది. పశ్చిమాసియాకి లేదా ఆ మార్గం గుండా ప్రయాణించాలనుకునే వారు తమ ప్రణాళికలను తీవ్రంగా పునఃపరిశీలించుకోవాలని, విమానాశ్రయాలు, ఎయిర్‌లైన్స్ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని కోరింది.ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాలోని పౌర విమానాశ్రయాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నారని ఈ అడ్వైజరీలో ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ ఘర్షణ "వేగంగా తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది" అని అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. ఇరాన్, దాని మద్దతు ఉన్న గ్రూపులు విదేశాల్లోని అమెరికా ప్రయోజనాలు, వ్యాపారాలు, సంస్థలను లక్ష్యంగా చేసుకోవచ్చని కూడా హెచ్చరించింది.సౌదీ రాజధాని రియాద్‌తో పాటు యాన్బు వంటి ఇతర సున్నిత ప్రాంతాలపై బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసినట్లు హౌతీలు ప్రకటించిన కొద్దిసేపటికే ఈ హెచ్చరిక వెలువడింది. రాజధాని వైపు దూసుకొస్తున్న ఒక క్షిపణిని అడ్డుకున్నామని సౌదీ ఎయిర్ డిఫెన్స్ దళాలు తెలిపాయి. రియాద్ విమానాశ్రయం సమీపంలో పేలుళ్లు, పొగ కనిపించినట్లు వార్తలు వచ్చినా.. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని సౌదీ అధికారులు ప్రకటించారు. ఇరాన్ డ్రోన్లు, క్షిపణుల ముప్పు, సాయుధ ఘర్షణలు, ఉగ్రవాదం వంటి కారణాలతో సౌదీ అరేబియాపై ఇప్పటికే లెవెల్ 3 (ప్రయాణాన్ని పునఃపరిశీలించండి) అడ్వైజరీ కొనసాగుతోంది. ఇక యెమెన్‌పై లెవెల్ 4 (ప్రయాణం చేయవద్దు) హెచ్చరిక అమల్లో ఉంది. యెమెన్ సరిహద్దుకు సమీపంలో పనిచేసే అమెరికా ప్రభుత్వ ఉద్యోగులపై అదనపు ఆంక్షలు కూడా విధించారు.

## దేశవ్యాప్త బ్యాంకుల సమ్మె.. ఖాతాదారులకు ఎస్‌బీఐ కీలక సూచన

**ఈ నెల 28 నుంచి 30 వరకు దేశవ్యాప్త బ్యాంకుల సమ్మె**

**బ్యాంకు పనులు ముందే పూర్తి చేసుకోవాలని కస్టమర్లకు ఎస్‌బీఐ సూచన**

**వారాంతపు సెలవులతో కలిపి ఐదు రోజుల పాటు సేవలకు అంతరాయం**

**ఏటీఎం, యూపీఐ, నెట్ బ్యాంకింగ్ సేవలు యథాతథంగా కొనసాగుతాయని వెల్లడి**

**'యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్' సమ్మెకు పిలుపు**

దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తమ ఖాతాదారులకు ఒక ముఖ్యమైన ప్రకటన జారీ చేసింది. 'యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్' (యూఎఫ్‌బీయూ) పిలుపు మేరకు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు దేశవ్యాప్తంగా బ్యాంకులు సమ్మెకు దిగనున్నాయి. అయితే, దీనికి ముందు సెప్టెంబర్ 26, 27 తేదీలు శని, ఆదివారాలు కావడంతో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకు శాఖలలో ప్రత్యక్ష సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని ఎస్‌బీఐ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమైన బ్యాంకు లావాదేవీలు ఉన్నవారు సమ్మె కంటే ముందే వాటిని పూర్తి చేసుకోవాలని సూచించింది.యూఎఫ్‌బీయూ తమ ఆందోళనలో భాగంగా ఇప్పటికే సెప్టెంబర్ 11న ఒకరోజు సమ్మె నిర్వహించింది. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల చివరలో మరోసారి నిరసనకు సిద్ధమైంది. అంతేకాకుండా అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు కూడా పిలుపునివ్వడంతో బ్యాంకింగ్ రంగంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఎస్‌బీఐ ఈ ముందస్తు సలహాలు జారీ చేసింది. సమ్మె సమయంలో బ్రాంచ్‌లలో సిబ్బంది సహాయం అవసరమయ్యే పనులు, డాక్యుమెంట్ల పరిశీలన, కొన్ని రకాల చెక్కుల ప్రాసెసింగ్ వంటి సేవలకు ఆటంకం కలగవచ్చని బ్యాంకు స్పష్టం చేసింది. సమ్మెలో ఎంతమంది ఉద్యోగులు పాల్గొంటారనే దానిపై బ్రాంచ్‌ల పనితీరు ఆధారపడి ఉంటుందని తెలిపింది. అయితే, వినియోగదారులు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాలని కోరింది.నగదు అవసరాల కోసం ఏటీఎంలు, ఆటోమేటెడ్ డిపాజిట్ అండ్ విత్‌డ్రాయల్ మెషీన్‌లు (ఏడీడబ్ల్యూఎం), అలాగే కస్టమర్ సర్వీస్ పాయింట్లు (సీఎస్‌పీ) అందుబాటులో ఉంటాయని ఎస్‌బీఐ పేర్కొంది. వీటితో పాటు ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యోనో, యూపీఐ వంటి డిజిటల్ సేవలు యథాతథంగా పనిచేస్తాయని స్పష్టం చేసింది. నిధుల బదిలీ, ఆన్‌లైన్ చెల్లింపులు వంటి వాటిని ఈ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఎలాంటి ఆటంకం లేకుండా చేసుకోవచ్చని వివరించింది. అయితే, భౌతికంగా బ్రాంచ్‌కు వెళ్లాల్సిన పనులను మాత్రం ముందుగానే ప్లాన్ చేసుకోవడం ఉత్తమమని ఖాతాదారులకు సూచించింది.

## సూర్యాపేటలో ఘోర ప్రమాదం.. కారులో సజీవదహనమైన వైద్యుడు

సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో మంటలు చెలరేగి, అందులో ప్రయాణిస్తున్న ప్రముఖ న్యూరో సర్జన్ సజీవదహనమయ్యారు. ఈ విషాద ఘటన పిల్లలమర్రి శివారులోని హైదరాబాద్-ఖమ్మం జాతీయ రహదారిపై జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఖమ్మంలోని మమత ఆసుపత్రిలో న్యూరో సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ కాసకుర్తి జగదీశ్, తన కారులో ఖమ్మం వైపు వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. పిల్లలమర్రి వద్దకు రాగానే ఆయన ప్రయాణిస్తున్న కారు అకస్మాత్తుగా అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు కారు మొత్తం వ్యాపించడంతో డోర్లు లాక్ అయ్యాయి. దీంతో డాక్టర్ జగదీశ్ బయటకు వచ్చే అవకాశం లేకపోయింది. అగ్నిగోళంలా మారిన కారులో ఆయన మంటల్లో చిక్కుకుని అక్కడికక్కడే సజీవదహనమయ్యారు. రహదారిపై వెళ్తున్న ఇతర వాహనదారులు ఈ దృశ్యాన్ని చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ఎల్ నినో ప్రభావం, ప్రభుత్వ కార్యాచరణపై సీఎం చంద్రబాబు సమీక్ష

గాను, ఇప్పటివరకు 79 శాతం భూముల్లోనే సాగు పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు పంటల బీమా మొత్తాలు వారికి అందేలా చూడాలని, డిమాండ్ ఆధారిత పంటల సాగుపై దృష్టి సారించాలని చెప్పారు. వర్షాధార పంటలు, ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ, హైరిస్క్ జోన్‌లోని ఉద్యాన పంటలను కాపాడేందుకు రూ.190 కోట్లు కేటాయించామని, ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఖరీఫ్ కంటింజెన్సీ ప్రణాళిక కోసం రూ.60 కోట్లు సిద్ధం చేశామని, 1.31 లక్షల క్వింటాళ్ల విత్తనాలను 80 శాతం సబ్సిడీతో రైతులకు సరఫరా చేశామని తెలిపారు. స్వయం సహాయక బృందాల ద్వారా కిచెన్ గార్డెన్‌లను ప్రోత్సహించి కూరగాయల ధరలను అదుపులో ఉంచవచ్చని అభిప్రాయపడ్డారు. పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావిస్తూ, "2014-19 మధ్య మేము ఇరిగేషన్‌పై రూ.65 వేల కోట్లు ఖర్చు చేస్తే, 2019-24 మధ్య నాటి ప్రభుత్వం కేవలం రూ.22 వేల కోట్లే ఖర్చు చేసింది. ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఎల్ నినో వంటి విపత్తు వచ్చినా ఇబ్బందులు ఉండేవి కావు. మేము అధికారంలోకి వచ్చాక రూ.3,500 కోట్లతో 100 రోజుల్లో హంద్రీ-నీవా కాలువలకు నీరందించగలిగాం" అని చంద్రబాబు గుర్తుచేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, స్థానిక ఎన్నికలున్నా ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటించి రైతులకు ధైర్యం చెప్పాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం, రైతు, సాగునీటి సంఘాలు కలిసికట్టుగా పనిచేసి ఎల్ నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

# ఏపీలో దసరా సెలవులు..

ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాల విద్యార్థులకు ఈ ఏడాది దసరా సెలవులు కాస్త ముందుగానే రానున్నాయి. అధికారికంగా ప్రకటించిన సెలవులకు ముందు రెండో శనివారం, ఆదివారం రావడంతో విద్యార్థులకు మరో రెండు రోజులు అదనంగా కలిసొచ్చాయి. దీంతో పండగ వాతావరణం ముందుగానే మొదలుకానుంది.రాష్ట్ర విద్యాశాఖ అకడమిక్ క్యాలెండర్ ప్రకారం, 2026 సంవత్సరానికి గాను అక్టోబర్ 12 నుంచి 21వ తేదీ వరకు, మొత్తం 10 రోజుల పాటు దసరా సెలవులను అధికారికంగా ప్రకటించారు. అయితే, దీనికి ముందుగా అక్టోబర్ 10వ తేదీ రెండో శనివారం, 11వ తేదీ ఆదివారం కావడంతో ఆ రెండు రోజులు కూడా సెలవుల్లో కలిసిపోయాయి. ఫలితంగా విద్యార్థులకు అక్టోబర్ 10 నుంచే సెలవులు ప్రారంభం కానున్నాయి. మొత్తం మీద 12 రోజుల పాటు విరామం లభించనుంది. సెలవుల అనంతరం అక్టోబర్ 22వ తేదీన పాఠశాలలు తిరిగి తెరుచుకుంటాయి. ఇక పొరుగు రాష్ట్రమైన తెలంగాణ విషయానికొస్తే, అక్కడ విద్యార్థులకు 13 రోజుల పాటు దసరా సెలవులు లభించనున్నాయి. అక్టోబర్ 10 నుంచి అక్టోబర్ 22 వరకు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. తిరిగి అక్టోబర్ 23న తరగతులు ప్రారంభమవుతాయి. ఈ ఏడాది విజయదశమి పండగ అక్టోబర్ 20వ తేదీ, మంగళవారం వచ్చింది. తెలంగాణలో అత్యంత వైభవంగా జరుపుకునే బతుకమ్మ ఉత్సవాలు అక్టోబర్ 18న జరగనున్నాయి.

## వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది.. నమ్మొద్దు:

ఖండించారు. తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు విజయవాడలో సుమారు 370 మంది స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులు ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, తమ నిరసనను తెలియజేశారు.ఈ సమావేశంలో టీచర్లు "అబద్ధాలు వద్దు - ఆత్మగౌరవం ముద్దు" అంటూ నినాదాలు చేశారు. తాము ఎంతో కష్టపడి, క్రీడల్లో పతకాలు సాధించి మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు పొందామని స్పష్టం చేశారు. మెగా డీఎస్సీ ప్రక్రియను అప్రతిష్ఠపాలు చేసే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. ఈ సందర్భంగా, స్పోర్ట్స్ కోటాను 3 శాతానికి పెంచి తమకు న్యాయం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. "కొంతమంది కావాలనే మాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వైసీపీ నేతలు అనుకునే గాంబ్లింగ్, పేకాట స్పోర్ట్స్ కోటాలో ఉండవు. బ్రిడ్జి గేమ్ గురించి తెలియక పేకాట అని తప్పుగా ప్రచారం చేస్తున్నారు. మాపైకి రాజకీయాలు నెట్టవద్దు. ఆటల్లో తగిలిన శారీరక గాయాల కన్నా, వారి మాటలు మమ్మల్ని మానసికంగా ఎక్కువ బాధిస్తున్నాయి" అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. "ఆరోపణలు చేస్తున్న ఛానళ్లు, నాయకులు కళ్లు తెరిచి మా సర్టిఫికెట్లు చూడాలి. ప్రతిభ ఉంటే ఒకే కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగాలు రాకూడదా?" అని వారు ప్రశ్నించారు. వైసీపీ చేస్తున్న నిరాధార ఆరోపణలను ప్రజలు నమ్మవద్దని వారు విజ్ఞప్తి చేశారు.

## సత్యప్రసాద్ వాంగ్మూలంపై జగన్ ఎందుకు స్పందించడంలేదు?: మంత్రి పార్థసారథి

ఈ కుంభకోణానికి సంబంధించిన కీలక నిర్ణయాలన్నీ అప్పటి ముఖ్యమంత్రి నివాసమైన తాడేపల్లి ప్యాలెస్‌లోనే తీసుకున్నారని సత్యప్రసాద్ చెప్పినట్లు వార్తలు వస్తున్నాయని తెలిపారు. "నిజాలు బయటపెడుతున్న సత్యప్రసాద్ మానసిక స్థితి సరిగా లేదని వైసీపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. తమకు అనుకూలంగా ఉన్నప్పుడు ఆయన ఆరోగ్యంగా ఉన్నట్లేనా? ఇప్పుడు వాస్తవాలు వెల్లడిస్తుండటంతోనే ఇలాంటి ముద్ర వేసి అసలు అంశాన్ని పక్కదారి పట్టించాలని చూస్తున్నారు. ఈ తప్పుడు ప్రచారాలు ఆపి, ఆరోపణలకు సూటిగా సమాధానం చెప్పాలి" అని పార్థసారథి సవాల్ విసిరారు.

**నగదు లావాదేవీల వెనుక మర్మమేంటి?** ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులను పూర్తిగా తొలగించి, కేవలం నగదు లావాదేవీలనే ప్రోత్సహించడం వెనుక ఉన్న మర్మమేంటని పార్థసారథి ప్రశ్నించారు. "కోట్లాది రూపాయల మద్యం విక్రయాలు నగదు రూపంలోనే జరగాలని ఎందుకు ఆదేశించారు? ఆ డబ్బు ఎక్కడికి వెళ్లింది? కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టడం, మాన్యువల్ విధానంలో ఆర్డర్లు కేటాయించడం వంటి చర్యలన్నీ అవినీతి కోసమే" అని ఆయన ఆరోపించారు. పెంచి తమ అనుయాయులకు కట్టబెట్టారని విమర్శించారు. మద్యం దుకాణాల్లో సిబ్బంది నియామకాలు, వారి జీతాల చెల్లింపుల్లోనూ భారీగా అక్రమాలు జరిగాయని ఆయన పేర్కొన్నారు.

**ప్రజల ఆరోగ్యంతో చెలగాటం** 2019 ఎన్నికలకు ముందు సంపూర్ణ మద్య నిషేధం అని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక నాసిరకం మద్యాన్ని అమ్మి ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టారని పార్థసారథి మండిపడ్డారు. కల్తీ మద్యం తాగి ఎంతోమంది అనారోగ్యం పాలయ్యారని, ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తమ కూటమి ప్రభుత్వం మద్యం విక్రయాల్లో నాణ్యతకు, పారదర్శకతకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. గౌడ సామాజిక వర్గానికి 10 శాతం దుకాణాలు కేటాయించామని, 'ఏపీ ఎక్సైజ్ సురక్ష' యాప్ ద్వారా నాణ్యతను పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. 13 రకాల పరీక్షల తర్వాతే మద్యాన్ని అమ్ముతున్నామని, దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అక్రమాలకు తావులేకుండా చూస్తున్నామని వివరించారు. మద్యం కుంభకోణంపై వెల్లువెత్తుతున్న ఆరోపణలపై జగన్ రెడ్డి తన మౌనాన్ని వీడి, ప్రజలకు వాస్తవాలు చెప్పాలని పార్థసారథి పునరుద్ఘాటించారు.

# కాంగ్రెస్‌కు రాజకీయ నిమజ్జనమే

ఖైరతాబాద్ ఉప ఎన్నికను ఎదుర్కొనే దమ్ము కాంగ్రెస్‌కు లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఉప ఎన్నికలు వస్తే కాంగ్రెస్‌కు రాజకీయ నిమజ్జనం తప్పదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ తమకు పోటీ కాదని, బీజేపీబీఆర్ఎస్ మధ్యే పోటీ ఉంటుందని అన్నారు. కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్ర రాజకీయాలు, అసెంబ్లీ సమావేశాల తీరుపై విమర్శలు చేశారు.

**ఏకపక్షంగా అసెంబ్లీ సమావేశాలు** ప్రజలు ఆశించిన విధంగా అసెంబ్లీ సమావేశాలు జరగలేదని బండి సంజయ్ అన్నారు. ప్రజా సమస్యలు, కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై చర్చ జరిగినప్పుడే అసెంబ్లీ సమావేశాలు సార్థకమైనట్లు భావిస్తారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ సభ్యులను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారని, బీజేపీకి కూడా మాట్లాడే అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు.

# కమ్యూనిస్టులు ఏకమవ్వాల్సిన వేళ ఇది!

ప్రపంచ దేశాలపై అమెరికా పెత్తనం బీటలు వారుతోంది. ఏ దేశానికీ లేనంత భారీ అప్పు (40 ట్రిలియన్ డాలర్ల)లో కూరుకుపోయింది. డాలర్ ఆధిపత్యానికి స్థానిక దేశీయ క్రాస్ బోర్డర్ కరెన్సీలతో గండి కొట్టాలని బ్రిక్స్ దేశాల కూటమి నిర్ణయించింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న ఎడతెగని యుద్ధంతో హోర్ముజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలకు అంతరాయమేర్పడింది. ఉక్రెయిన్‌రష్యా యుద్ధానికి తోడు, యెమెన్‌కు చెందిన హౌతీలు సౌదీ అరేబియా ఆయిల్ కంపెనీలు, పైప్‌లైన్‌లపై నిర్వహిస్తున్న దాడులు ప్రపంచ ఇంధన సమస్యలను మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. ఎర్ర సముద్రాన్ని, హిందూ మహా సముద్రంతో అనుసంధానించే 'బాబ్‌ఎల్‌మండేబ్ జలసంధి'పై హౌతీ తిరుగుబాటుదారులు పట్టు బిగించారు. తత్ఫలితంగా చమురు రవాణాకు అత్యంత కీలకమైన మరో జలసంధిలో కూడా నౌకల రాకపోకలకు ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో చమురు బ్యారెల్ ధర 110 డాలర్లకు పెరిగింది. ఆధునిక ఆర్థిక కార్యకలాపాలకు జీవనాడి అయిన ఇంధన సరఫరా స్తంభించిపోయింది. ప్రపంచవ్యాప్తంగా నిత్యావసరాల ధరలు భరించలేని స్థాయికి పెరిగిపోయాయి. డోనాల్డ్ ట్రంప్ పదే పదే విధిస్తున్న ఆంక్షలు, పన్నులతో అన్ని దేశాలు తీవ్ర ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఇంధన సమస్యలు, సప్లై చైన్స్ విచ్ఛిన్నం, కంపెనీల మూత, వడ్డీ రేట్లు, ధరల పెరుగుదల, జీవనోపాధుల విధ్వంసం, నిలిచిపోయిన ఎరువుల సరఫరా మొదలైన సమస్యలు సకల దేశాల ఆర్థిక వ్యవస్థలను కుదిపేస్తున్నాయి. రష్యా నుంచి చౌక ధరలకు ఆయిల్ కొనుగోలు చేస్తున్న భారత్ సహా ఐదు దేశాలపై అమెరికా 100శాతం పన్నులు విధిస్తూ ఒక చట్టాన్ని తీసుకువచ్చింది. ఆయా దేశాలలోని వందల కోట్ల ప్రజలకు చౌక ఇంధనం లేకుండా చేయడమే ట్రంప్ లక్ష్యం. మోదీ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. అమెరికా చర్యలను చైనా తీవ్రంగా ఖండించింది. ట్రంప్ దీర్ఘకాలంగా అనేక రూపాల్లో భారత ప్రజలపై కత్తిగట్టారు. అయినా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో విదేశీ వ్యాపారంలో మోదీ ప్రభుత్వం అమెరికాకు లొంగిపోతోంది. నరేంద్ర మోదీ ప్రభుత్వం విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజలలో చీలికలు సృష్టించింది. బడా సంపన్నులను వదిలి, సామాన్య మధ్య తరగతి కష్టార్జితాలను దోచేస్తున్నారు. ప్రతి వినియోగదారుడు యూపీఐ డిజిటల్ చెల్లింపుల బాధితుడవుతున్నాడు. జీఎస్టీ దోపిడీకి ఇది అదనం. బడా సంపన్నుల 18.50 లక్షల కోట్ల రూపాయల రుణాలను మోదీ సర్కార్ మాఫీ చేసింది. ప్రభుత్వ బ్యాంకుల నుంచి సుభాష్ చంద్ర తీసుకున్న రూ.20,206.54 కోట్ల రుణంలో 6.5 కోట్లు మాత్రమే చెల్లించమని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ చెప్పింది. రూ.20,200 కోట్ల రుణం మాఫీ చేసింది. రుణదాతలు పైకోర్టుకు వెళ్లారు. పేదవాళ్లు తీసుకున్న రుణాలను ముక్కుపిండి వసూలు చేసే బ్యాంకులు... పెద్దలకు ఎందుకు మాఫీ చేస్తున్నాయి? జాతీయ, ప్రాంతీయ పార్టీలు బడా సంపన్నుల సేవకు పరిమితమవుతున్నాయి. ఆయా పార్టీల ప్రభుత్వాల అవినీతి భరించలేని స్థాయికి చేరింది. ప్రజాతంత్ర శక్తులు, కమ్యూనిస్టులు ఐక్యవేదికపై పనిచేయాల్సిన అనివార్యత ఏర్పడింది. ప్రపంచ పరిణామాలు దీనిని బలపరుస్తున్నాయి.

బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, బుర్కినో ఫాసో, నైజర్, మాలి లాంటి అనేక దేశాలలో 'జెన్ జీ' తిరుగుబాట్లతో ప్రభుత్వాలు తుడిచిపెట్టుకుపోయాయి. ప్రపంచ గమనం ఎప్పుడూ లేనంత శరవేగంగా మారుతోంది. ఇటీవలి విద్యార్థి జెన్ జీ ఉద్యమం, ఇతర రాష్ట్రాలకు వ్యాపించిన తీరు యువతలో రగులుతున్న ఆందోళనను వెల్లడిస్తున్నది. ప్రస్తుత విద్యా విధానంలో, పరీక్షల్లో చోటుచేసుకుంటున్న అవకతవకలపై విద్యార్థి, యువజనలోకం తీవ్ర ఆగ్రహంతో ఉంది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ గాలికి పోయింది. ఉద్యోగాల్లో కోత యువతను వణికిస్తోంది. నిరుద్యోగం ఎల్లెడలా తాండవిస్తోంది. రైతుల ఆదాయాన్ని రెండింతలు చేస్తామనే వాగ్దానం నెరవేర్చడంపై మోదీ ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు. రైతులోకం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ఈశాన్య భారతంలోని మణిపూర్ రెండున్నరేళ్లుగా జాతుల ఘర్షణతో మండిపోతోంది. విద్య, వైద్యం భారీ వ్యాపారాలయ్యాయి. కృత్రిమ మేధ తదితర అధునాతన సాంకేతికతల మూలంగా లక్షల ఉద్యోగాలు ఊడుతున్నాయి. మనుషులు లేకుండా, రోబోలతో నడిచే అత్యాధునిక హైటెక్ పరిశ్రమలుగా నేటి ఆధునిక పరిశ్రమలు పరిణమించాయి.

మానవ నైపుణ్యాన్ని, పనిలో మనిషి అవసరాన్ని ఉత్పత్తిలో, పంపిణీలో చాలా వేగంగా తొలగించే స్థాయికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చేరుతోంది. మోదీ సర్కార్ ప్రారంభించిన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం 'పేరు గొప్ప.. ఫలితం దిబ్బ'గా మారింది. సాఫ్ట్‌వేర్ కంపెనీలు, బ్యాంకులు ఇతర సంస్థలలో పనిచేసే వారి ఉద్యోగాలకు అధునాతన సాంకేతికతలతో తీవ్ర ముప్పు ఏర్పడింది. కొత్త ఉద్యోగాల సృష్టి ఆగిపోయింది. ఉన్న ఉద్యోగాలను తగ్గించడం ఎలా అనేదే నేటి లక్ష్యంగా మారింది. సమీప భవిష్యత్తులోనే లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోతారనీ అంతర్జాతీయ నివేదికలు వెల్లడిస్తున్నాయి. అమెరికా, ఇతర సంపన్న దేశాలలోని భారతీయులు ఉద్యోగాలు కోల్పోయి స్వదేశానికి తిరిగివచ్చే అవకాశం ఉంది. ఫలితంగా మనదేశంలోని యువత, విద్యార్థుల, రైతుల ఉద్యమాలు మరింత ముమ్మరమవుతాయి.

ప్రత్యామ్నాయ వ్యవస్థను నిర్మించుకోవాలనే ఆకాంక్ష ఆయా వర్గాలు చేస్తున్న స్వతంత్ర ఉద్యమాల్లో బలంగా వ్యక్తమవుతోంది. జాతీయ, ప్రాంతీయ రాజకీయ పక్షాలు ప్రజల సమస్యలకు పరిష్కారం చూపకపోగా వాటిని మరింతగా పెంచుతున్నాయి.

# పిజిఆర్ఎస్ సేవలపై పై క్యూ.ఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి

## - జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**కడప, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 20 నంది పత్రిక:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) ద్వారా అందుతున్న సేవలపై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మరింత పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించే దిశగా రాష్ట్ర సేవలను నిరంతర అభిప్రాయ సేకరణ చేసి ప్రజల సంతృప్తి స్థాయిని మెరుగుపరచడం, వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను కోరుతుందన్నారు. పిజిఆర్ఎస్ కేంద్రాలను సందర్శించే పౌరుల నుండి అభిప్రాయాన్ని సేకరించేందుకు జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాలలో, వివిధ మాధ్యమాల్లో ప్రజల అభిప్రాయ సేకరణకు క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా క్యూ.ఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించారు. క్యూ. ఆర్ కోడ్‌ను స్పష్టంగా, కంటికి కనిపించే పరిమాణంలో ముద్రించి, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పౌరులు పిజిఆర్ఎస్ సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చన్నారు. . ఎక్కువ సంఖ్యలో పౌరులు భాగస్వామ్యం అయ్యే విధంగా నోటీసు బోర్డులు, హెల్ప్ డెస్క్‌లు, ఫిర్యాదుల కౌంటర్లు, తదితర ప్రదేశాల్లో పెట్టాలని కలెక్టర్ సూచించారు. క్యూ.ఆర్ కోడ్ ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్ కు చేరుతుందని అన్నారు. అర్జీల స్థితిగతులు తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ ను వినియోగించుకోవాలని, తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోను, మండల కార్యాలయాల్లోనూ నిర్వహించే పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు అందించండి, వాటిపై మీ స్పందన క్యూ.ఆర్ కోడ్ ద్వారా తెలియజేయండి అని కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# వర్షాలతో ప్రజలకు ఇబ్బంది లేకుండా పారిశుధ్యం మెరుగ్గా చేపట్టాలి






## కమిషనర్ జయకృష్ణ

**తిరుపతి బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 20 నంది పత్రిక**నగరంలో కురుస్తున్న వర్షాలతో ప్రజలకు ఇబ్బంది లేకుండా పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం నగరంలోని గోవిందరాజస్వామి ఆలయం పరిసరాలు, రాజన్న పార్కు, విష్ణు నివాసం, బస్టాండ్, రైల్వే స్టేషన్, అన్నమయ్య సర్కిల్, జూ పార్కు రోడ్డు, అలిపిరి రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. వర్షాలకు పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడటాన్ని గమనించిన కమిషనర్ వాటిని వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కాలువల్లో నీరు సజావుగా వెళ్లేలా చెత్త తొలగించాలని తెలిపారు. యాత్రికులు తిరిగే ప్రాంతాల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న జీవీపీ (చెత్త కుప్పలు) పాయింట్లను పరిశీలించి, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. అన్నమయ్య సర్కిల్ కూడలి వద్ద తుడా కాంప్లెక్స్ ముందు చెత్త అధికంగా ఉండటాన్ని గమనించి వెంటనే శుభ్రం చేయించాలని సిబ్బందికి సూచించారు. శ్రీనివాసం, విష్ణు నివాసం పరిసరాల్లో పారిశుధ్యం సరిగా లేకపోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, బస్టాండ్, రైల్వే స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అలిపిరి మార్గంలో అక్కడక్కడా దెబ్బతిన్న డివైడర్లను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయించాలని సూచించారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్యంతో పాటు మౌలిక వసతులపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని కమిషనర్ స్పష్టం చేశారు.

ఈ పర్యటనలో కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, శానిటేషన్ సూపర్వైజర్ సుమతి, సిబ్బంది పాల్గొన్నారు.






# మోడీ 25 ఏళ్ల ప్రస్థానం డైరీ ఎమ్మెల్యే బుడ్డాకు అందజేత

### ప్రధాని మోదీ సేవలు ఆదర్శనీయం: బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా

### సీఎంఆర్ఎఫ్ సాయంలో కర్నూలు జిల్లాలోనే ఎమ్మెల్యే బుడ్డా నంబర్ 1

### షబానా సేవా కార్యక్రమాలను అభినందించిన శ్రీశైలం ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

**వెలుగోడు (నంది పత్రిక):** ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవ ప్రస్థానం, 'సేవా సంకల్ప్ అభియాన్' స్ఫూర్తితో దేశ ప్రజల మనసులను గెలుచుకున్నారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా కొనియాడారు. ఆదివారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి నివాసంలో ఆయనను షబానా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ విశిష్ట పాలనా రికార్డులతో కూడిన ప్రత్యేక డైరీని ఎమ్మెల్యేకు ఆమె అందజేశారు.

**పేదల ప్రాణాలకు భరోసాగా ఎమ్మెల్యే బుడ్డా:** శ్రీశైలం నియోజకవర్గాన్ని ప్రగతిపథంలో నడిపిస్తూ, పేదల సంక్షేమానికి కట్టుబడిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ప్రజా నిబద్ధతపై షబానా ప్రశంసల జల్లు కురిపించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే రికార్డు స్థాయిలో 'ముఖ్యమంత్రి సహాయ నిధి' చెక్కులను అందిస్తూ, నిరుపేదల ప్రాణాలకు భరోసాగా నిలవడంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మొదటి స్థానంలో నిలిచారని కొనియాడారు. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి పేద కుటుంబానికి అండగా నిలుస్తున్న ఆయన సేవలు అభినందనీయమని అన్నారు.

**షబానా సేవా దృక్పథం ఆదర్శనీయం:** ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భాన్ని పురస్కరించుకుని ఆత్మకూరులోని బీజేపీ కార్యాలయంలో మోమిన్ షబానా ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రత్యేకంగా ప్రశంసించారు. షబానా స్వయంగా



రక్తదానం చేయడంతో పాటు ఉచిత రక్తదాన శిబిరం, మెడికల్ క్యాంప్ నిర్వహించడం, నిరుపేద మహిళలకు చీరల పంపిణీ చేయడం ఆమె సామాజిక బాధ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజలకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూర్చేలా ఆమె చేపట్టిన ఈ సామాజిక కార్యక్రమాలు అందరికీ ఆదర్శనీయమని ఎమ్మెల్యే అన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ను సద్వినియోగం చేసుకోండి

### కమిషనర్ జయకృష్ణ

**తిరుపతి బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 20 నంది పత్రిక**
నేడు నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ జయకృష్ణ, ఐఏఎస్ ఆదివారం



ఒక ప్రకటనలో తెలిపారు.

తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సెప్టెంబర్ 21 వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని తెలియజేశారు.

అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపరచాలని కమిషనర్ తెలిపారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న షేక్ అబ్దుల్ గఫార్ గారిని పరామర్శించిన టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి గారు.



కడప నగరంలోని నాగరాజుపేటకు చెందిన టీడీపీ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ షేక్ అబ్దుల్ రవూఫ్ గారి సోదరుడు షేక్ అబ్దుల్ గఫార్ గారు గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీ రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి గారు వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, అందుతున్న వైద్య సేవలపై కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కడప జిల్లా పరిషత్ ఆవరణలో నూతన వాణిజ్య సముదాయాన్ని ప్రారంభించిన టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి గారు, ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డి గారు.



కడప నగరంలోని జిల్లా పరిషత్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఆధునిక వాణిజ్య సముదాయాన్ని టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీ రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి గారు, ప్రభుత్వ విప్, కడప శాసనసభ్యురాలు శ్రీమతి రెడ్డెప్పగారి మాధవి రెడ్డి గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించి, అనంతరం నూతన భవన సముదాయాన్ని పరిశీలించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక వ్యాపారులకు అనుకూలమైన వాతావరణం కల్పించడంతో పాటు జిల్లా పరిషత్‌కు శాశ్వత ఆదాయ వనరులను సమకూర్చే దిశగా ఈ వాణిజ్య సముదాయం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కడప నగర సమగ్రాభివృద్ధికి, వ్యాపార-వాణిజ్య రంగాల పురోగతికి కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి ముఖ్య నేతలు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



## పిఎం శ్రీ కడప కేంద్రీయ విద్యాలయ పనితీరుపై జాయింట్ సెక్రటరీ ప్రశంసలు..!

### 100 శాతం ఉత్తీర్ణత, క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన అభినందనీయం

**కడప బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 20 నంది పత్రిక** : పిఎం శ్రీ పథకం కింద కడప కేంద్రీయ విద్యాలయంలో విద్యా సంస్కరణలను సమర్థవంతంగా అమలు చేస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్న తీరుపై.. భారత ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ శ్రీ రజత్ కుమార్ సైని ప్రశంసలు కురిపించారు. పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించడం, క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన, విద్యార్థుల సమగ్ర వికాసానికి చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు.పిఎం శ్రీ పథకం అమలు తీరు, పాఠశాల విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, బోధనా విధానాలను సమీక్షించేందుకు కడప కేంద్రీయ విద్యాలయాన్ని సందర్శించిన జాయింట్ సెక్రటరీ శ్రీ రజత్ కుమార్ సైని సమగ్ర తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ మునేష్ మీనా పనితీరును ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల ఆవరణ, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, విద్యార్థులకు అనుకూలమైన అభ్యసనా వాతావరణం సంతృప్తికరంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ విద్యకు ప్రాధాన్యతనిస్తూ పాఠశాలలో 59 కంప్యూటర్లు, 17 స్మార్ట్ తరగతి గదులు అందుబాటులో ఉండటం, ఉపాధ్యాయులు డిజిటల్ బోధనా పద్ధతులతో పాటు దీక్షా వేదికను క్రమం తప్పకుండా వినియోగించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. జాతీయ విద్యా విధానం-2020కు అనుగుణంగా విద్యార్థులకు ఆహ్లాదకరమైన, కృత్యాధారిత బోధన అందించడం, జాదూయీ పిటారా వినియోగం, కృత్రిమ మేధస్సు ఆధారిత నైపుణ్య విద్యను అందిస్తున్న విధానాన్ని ఆయన ప్రశంసించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత పెంపొందించేలా రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమాల ద్వారా విజ్ఞాన యాత్రలు నిర్వహించడం కూడా అభినందనీయమన్నారు.విద్యార్థుల సౌకర్యాలను మరింత మెరుగుపరిచేలా పాఠశాలలో కొనసాగుతున్న మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. నూతన మార్గదర్శకాలను పాటిస్తూ పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సౌకర్యాలపై నిరంతరం దృష్టి సారించాలని సూచించారు.కడప కేంద్రీయ విద్యాలయం సాధిస్తున్న ప్రగతిపై జాయింట్ సెక్రటరీ శ్రీ రజత్ కుమార్ సైని ఉపాధ్యాయ బృందాన్ని, ప్రిన్సిపాల్ శ్రీ మునేష్ మీనాను అభినందించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో సబ్ కలెక్టర్ హెచ్ ఎస్. భావన, డీఈవో శంశుద్దీన్, కేవీ కడప టీచింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.



# బోర్ పాయింట్ పేరుతో దోపిడీ?

**నీటి అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న కొందరు ప్రైవేట్ జియాలజిస్టులు**

**రూ.3 వేల నుంచి రూ.15 వేల వరకు వసూళ్ల ఆరోపణలు**

**600 నుంచి 1000 అడుగుల వరకు బోర్లు.. నిబంధనలు గాలికి?**

**అధికారులు సమగ్రంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్**




**డోన్ : నంది పత్రిక సెప్టెంబర్ 20** భూగర్భ జలాలపై ఆధారపడే రైతులు, గృహ వినియోగదారుల అవసరాన్ని కొందరు ప్రైవేట్ జియాలజిస్టులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులను ఆసరాగా చేసుకుని భూమిలో నీటి నిల్వలు ఎక్కడ ఉన్నాయో గుర్తిస్తామంటూ 'బోర్ పాయింట్' పేరుతో భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని పలువురు భూ యజమానులు వాపోతున్నారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల సాంకేతిక పరిజ్ఞానం పేరుతో ప్రచారం చేసుకుంటూ కొందరు వ్యక్తులు నీటి అవసరం ఉన్న వారిని ఆకర్షిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా బోర్ పాయింట్ గుర్తింపునకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నారని, ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానం పేరుతో మరికొందరు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు తీసుకుంటున్నారని వ్యవసాయ భూముల యజమానులు చెబుతున్నారు.

**అనుమతులు, నిబంధనలపై ప్రశ్నలు** భూగర్భ జలాల వినియోగం, బోరుబావుల ఏర్పాటుకు సంబంధించి అమలులో ఉన్న నిబంధనలు, సాంకేతిక పరిమితులను పాటించాల్సిన అవసరం ఉంది. అయితే కొందరు తమను తాము 'జియాలజిస్టులు'గా పరిచయం చేసుకుంటూ నిబంధనలకు విరుద్ధంగా లోతైన బోరుబావులు తవ్వించేందుకు భూ యజమానులను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**600 నుంచి 1000 అడుగుల వరకు బోర్లు?** కొన్ని ప్రాంతాల్లో 600 అడుగుల నుంచి 1000 అడుగుల వరకు బోరుబావులు తవ్విస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. నీరు లభించకపోతే భారీగా ఆర్థిక నష్టం వాటిల్లడంతో పాటు, భూగర్భ జలాల నాణ్యతపై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. లోతైన భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ లేదా ఇతర హానికర పదార్థాలు ఉండే అవకాశం ఉన్నందున, నీరు లభించిన అనంతరం నాణ్యత పరీక్షలు నిర్వహించడం కూడా ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. డోన్ కేంద్రంగా వసూళ్ల ఆరోపణలు డోన్ పరిసర ప్రాంతాల్లో కొందరు తాము ఉత్తమ జియాలజిస్టులమని చెప్పుకుంటూ బోర్ పాయింట్ల పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నీటి అవసరంతో ఇబ్బందులు పడుతున్న రైతులు, సాధారణ ప్రజల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని కొందరు భూ యజమానులు ఆరోపిస్తున్నారు.

**అధికారులు చర్యలు తీసుకోవాలి** బోర్ పాయింట్ గుర్తింపు పేరుతో జరుగుతున్న వసూళ్లు, బోరుబావుల తవ్వకాల్లో నిబంధనల ఉల్లంఘనలు ఉన్నాయా అనే అంశంపై సంబంధిత భూగర్భ జలాల శాఖ అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అనుమతులు, సాంకేతిక అర్హతలు, బోరు తవ్వకాల పరిమితులు, నీటి నాణ్యత పరీక్షలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. నీటి కోసం రైతులు, ప్రజలు పెట్టుబడి పెడుతున్న ప్రతి రూపాయికి తగిన ఫలితం దక్కేలా సంబంధిత అధికారులు పర్యవేక్షణను పెంచాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

# బండి ఆత్మకూరులో రూపు దిద్దుకుంటున్న కళాశాల మైదానం





**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 20:** బండి ఆత్మకూరులోని జూనియర్ ప్రభుత్వ కళాశాల మైదానం లెక్చరర్ల చొరవతో రూపు దిద్దుకుంటూ ఉంది. గత కొద్ది నెలల నుండి కళాశాల మైదానాన్ని ఎవరూ పట్టించుకోక పోవడంతో కళాశాల మైదానం దుర్గంధ భరితంగాను, విపరీతంగా కంప చెట్లు పెరిగిపోయి అడవిని తలపించే విధంగా తయారయింది. కళాశాల మైదానాన్ని శుభ్రం చేయడంలో ప్రిన్సిపాల్ పట్టించుకోవడం లేదన్న విమర్శలు కూడా వినిపించాయి. మైదానాన్ని శుభ్రపరిచేందుకు విద్యార్థుల ద్వారా వసూలు చేసే స్పెషల్ ఫీజులో కొంత సొమ్మును డ్రా చేసి వినియోగించ లేదన్న విమర్శలు కూడా వినిపించాయి. కళాశాల మైదానాన్ని శుభ్రం చేసేందుకు కొద్దికాలం క్రితమే ప్రిన్సిపల్ గ్రామస్థాయి నాయకులను కూడా ప్రాధేయ పడినట్లుగా గుసగుసలు వినిపించాయి. ఈ విషయంలో మొదట్లో అంగీకరించిన గ్రామ పెద్ద మనుషులు కొందరు, కళాశాల మైదానం శుభ్రం చేసిన తర్వాత డబ్బులు ఇచ్చే విషయంలో చేతులెత్తేశారు. కళాశాల మైదానాన్ని శుభ్రపరిచేందుకు లెక్చరర్లు డాక్టర్ రఘునాథరెడ్డి,డాక్టర్ నజీరుద్దీన్ నడుం బిగించారు. రెండు రోజులట్రాక్టర్ క్రితం తెప్పించి, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసే పనికి పూనుకున్నారు. ప్రస్తుతం కళాశాల మైదానం ఓ కొలిక్కి వచ్చింది.

**కళాశాలకు కాంపౌండ్ వాల్ ఏది?** బండి ఆత్మకూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభమై 20 సంవత్సరాలు పైబడుతున్నప్పటికీ నేటి వరకు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నోచుకోవడం లేదు.

కళాశాల మైదానం ప్రాంతంలో పందులు సంచరిస్తూ ఉండటం వల్ల విద్యార్థులు వ్యాధుల బారిన పడే పరిస్థితులు నెలకొంటూ ఉన్నాయి.

అదేవిధంగా వంట మనుషులకు వంట చేసేందుకు గాను సరైన సౌకర్యం లేకపోవడంతో వంట మహిళలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు చొరవచూపి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి మహిళలకు వంట చేసేందుకు గాను ప్రత్యేకంగా వంట రూమ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు.

# రజక విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేసిన మంత్రి టీజీ భరత్



**నంది పత్రిక కర్నూలు ప్రతినిధి** కర్నూలు నగరంలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన రజక విద్యార్థుల ప్రతిభ పురస్కారాల కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్, డిగ్రీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రజక విద్యార్థులకు మంత్రి టీజీ భరత్ ప్రతిభ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాల్లోనూ రాణించేలా తమ ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థికి టైమ్ మేనేజ్‌మెంట్ ఎంతో ముఖ్యమని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కర్నూలు నియోజకవర్గానికి చెందిన విద్యార్థులకు టీజీవీ గ్రూప్ తరపున ఒక్కొక్కరికి రూ.2,000 చొప్పున సహాయం అందిస్తామని మంత్రి టీజీ భరత్ తెలిపారు. అలాగే జిల్లా వారీగా ఉన్న విద్యార్థులకు కూడా సంబంధిత ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లతో మాట్లాడి అవసరమైన సహకారం అందించేలా కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలందరికీ తెలియాలని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం చేస్తున్న కృషితో పాటు, కర్నూలు అభివృద్ధికి తాను చేస్తున్న ప్రయత్నాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తన వంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని వారితో మంత్రి టీజీ భరత్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రామారావు, వ్యవస్థాపక అధ్యక్షులు సి.పి వెంకటేష్, నాయకులు లింగమయ్య, గణేష్, రేణుక, రాధ, పాల్గొన్నారు.



# వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు.. మంత్రి టీజీ భరత్

**రాంబొట్ల దేవాలయం వద్ద వినాయకుడికి మంత్రి టీజీ భరత్ ప్రత్యేక పూజలు**



**కర్నూలు సిటీ నందిపత్రిక** నీటి కష్టాలు ఉన్నప్పటికీ వినాయక నిమజ్జనానికి ప్రణాళికాబద్ధంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. కర్నూలు నగరంలోని రాంబొట్ల దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడిని మంత్రి టీజీ భరత్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ కర్నూలు నగరంలో వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయని తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని దేవుడిని కోరుకుంటున్నట్లు చెప్పారు. కేసీ కెనాల్‌లో రెండు వైపులా గోడలు నిర్మించి, ట్యాంక్ తరహాలో నీటిని నిల్వ చేసి వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు చేసినట్లు మంత్రి తెలిపారు. దీంతో పాటు నన్నూరు టోల్ ప్లాజా వద్ద హంద్రీనీవాలో కూడా వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు చేశామని చెప్పారు. ప్రజలు తమకు ఇష్టమైన ప్రాంతాల్లో వినాయక నిమజ్జనం చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. అనంతరం మంత్రి టీజీ భరత్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి, అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# నేడు (21వ తేదీ) పీజీఆర్ఎస్ కార్యక్రమం..!

**కడప, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 20 నంది పత్రిక:** జిల్లా ప్రజల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్ సభాభవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు డీఆర్వో మల్లికార్జునుడు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిల్లో కూడా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలతో హాజరై వినతిపత్రాలు సమర్పించాలని కోరారు. అలాగే గతంలో సమర్పించిన అర్జీల వివరాలు తెలుసుకోవడానికి 1100 కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవచ్చని, పాత అర్జీలకు సంబంధించిన రసీదు ఉంటే వెంట తీసుకురావాలని సూచించారు.

# డోన్ నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి

**నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి: సీపీఎం**




**డోన్ : నంది పత్రిక సెప్టెంబర్ 20** డోన్ నియోజకవర్గాన్ని తక్షణమే కరువు ప్రాంతంగా ప్రకటించి, వర్షాభావంతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం డోన్ పాత బస్టాండ్‌లోని గాంధీ విగ్రహం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో కరువు రైతులను ఆదుకోవాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరుతూ నిరసన చేపట్టారు. కార్యకర్తలు ఉరి తాళ్లు బిగించుకొని, ఆకులు తింటూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నక్కి శ్రీకాంత్, రామాంజనేయులు మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులతో పాటు వర్షాభావంతో పంటలు వేయలేకపోయిన రైతులను కూడా ప్రభుత్వం గుర్తించి పరిహారం అందించాలని కోరారు. పంట రుణాలను రీషెడ్యూల్ చేసి, కొత్త రుణాలు అందించడంతో పాటు విత్తనాలు, ఎరువులు, సాగునీటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతోందన్నారు. బ్లాక్ మార్కెట్, అక్రమ నిల్వలను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, చౌకధరల దుకాణాల ద్వారా నిత్యావసర వస్తువులను తక్కువ ధరలకు అందించాలని కోరారు. ప్రజలపై అదనపు భారం పడేలా ఉన్న యూపీఐ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శివరాం, చిన్న రహిమాన్, షేమిమ్ బేగం, నక్కి హరి, అశోక్, శ్రీనివాసులు, మదన గోపాల్, షాబాన, మాధవి, సూర్య పద్మావతి, వరలక్ష్మి, బీబీ, ముగ్గేన్నా, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# ఐపీఎల్ తరహాలో ఐబీపిఎల్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్



**డోన్ : నంది పత్రిక సెప్టెంబర్ 20:** నంద్యాల జిల్లా డోన్ పట్టణంలోని బుగ్గన శేషారెడ్డి మెమోరియల్ షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో అక్టోబర్ 3, 4 తేదీల్లో ×డ్రూా తరహాలో ×ద్రూా షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్‌లో ఆరు ఫ్రాంచైజీలకు చెందిన ఓనర్లు ముందుకు రాగా, సుమారు 100 మంది క్రీడాకారులను పాయింట్ల విధానంలో ఫ్రాంచైజీలు ఎంపిక చేసుకున్నట్లు పేర్కొన్నారు. శని, ఆదివారాల్లో జరిగే ఈ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటాలని నిర్వాహకులు కోరారు. అదేవిధంగా డోన్ షటిల్ ఇండోర్ స్టేడియంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు శివశంకర్ కంప్యూటర్స్‌కు చెందిన శివ సహకరిస్తున్నట్లు స్టేడియం నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు జహీర్, అర్జున్ రెడ్డి, సర్వజ్ఞమూర్తి, విక్రమ్, కరుణాకర్, శబరీష్, రషీద్ తదితర క్రీడా సభ్యులు పాల్గొన్నారు.

# బేతంచెర్ల లో గుండె సంబంధిత ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు.



**బేతంచెర్ల సెప్టెంబర్ 20 ( నందిపత్రిక ).** ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో కర్నూలు కిమ్స్ హాస్పిటల్ సహకారంతో బేతంచెర్ల పట్టణములో గుండె సంబంధ ఉచిత వైద్య శిబిరంను ఆదివారం ఏర్పాటు చేయడమైనది బిపి,షుగర్,ఈ సిజి,2 డి.ఎ.కో. పరీక్షలు దాదాపుగా 150 మందికి ఉచితంగా కిమ్స్ హాస్పిటల్ గుండె వ్యాధి నిపుణులతో ఉచితంగా చూడటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా కోఆప్టెడ్ మెంబర్ నాగ సురేంద్ర గౌడ్, కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది మరియు రెడ్ క్రాస్ సభ్యులు టి.సువర్ణ,స్వాతి,ఎస్. సువర్ణ,రమ్యశ్రీ, అంజలి, నీలావతి,వరప్రసాద్, హైమావతి మరియు పట్టణ ప్రజలు పాల్గొనడం జరిగినది.



## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ దేవేంద్రప్పకు ఘన సన్మానం

### సమ సమాజ నిర్మాత ఉపాధ్యాయుడు.. పాఠశాలే దేశానికి నిజమైన పార్లమెంటు



**డోన్ :నంది పత్రిక సెప్టెంబర్ 20:** డోన్ పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ప్రజాకవి, తెలుగు సాహితీవేత్త డాక్టర్ చిట్యాల దేవేంద్రప్ప 2026 సంవత్సరానికి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన సందర్భంగాఎస్ టీ యూ డోన్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. డోన్ పట్టణంలోని సాయి ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు, సాహితీవేత్తలు, విద్యాభిమానులు, ఎస్ టీ యూ నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సభాధ్యక్షులు కవిరాజహంస డాక్టర్ టి. సురేష్ బాబు మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యాబోధన చేయడంతో పాటు తెలుగు భాష, సాహిత్యంపై ఆసక్తిని పెంపొందిస్తూ, తన సాహితీ సేవల ద్వారా సమాజానికి విశేష సేవలు అందిస్తున్న డాక్టర్ చిట్యాల దేవేంద్రప్పకు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించడం డోన్ మండలానికి, ఉపాధ్యాయ సమాజానికి గర్వకారణమని అన్నారు.ఎస్ టీ యూ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఆజాంబేగ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధత, విద్యార్థుల పట్ల ఆప్యాయత, తెలుగు భాషా సాహిత్యాల పట్ల అభిమానం, సామాజిక చైతన్యాన్ని పెంపొందించే రచనలు డాక్టర్ దేవేంద్రప్పకు ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయని కొనియాడారు. అనంతరం ఎస్ టీ యూ డోన్ మండల శాఖ తరపున డాక్టర్ చిట్యాల దేవేంద్రప్పను ఘనంగా సన్మానించి, శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఆయన భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పురస్కారాలు అందుకోవాలని, ఉపాధ్యాయ రంగంతో పాటు సాహిత్య రంగంలో మరింత సేవలు అందించాలని వక్తలు ఆకాంక్షించాల

## కాంగ్రెస్ పార్టీలో చేరిన రామచిలకల యువరాజ్



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు జిల్లా డీసీసీ అధ్యక్షుడు క్రాంతికుమార్ నాయుడు ఆధ్వర్యంలో మంత్రాలయం మండలానికి చెందిన రామచిలకల యువరాజ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీతో కలిసి పనిచేసేందుకు యువరాజ్‌ను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పి.వి. మోహన్ సమక్షంలో యువరాజ్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, మంత్రాలయం మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. యువరాజ్ చేరికతో మండలంలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూరుతుందని వారు పేర్కొన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పుడమి తల్లిని తాకిన వరుణుడు ,, రైతన్నలు హర్షం

### మహానంది మండలంలో 44 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

### పొంగి పొర్లిన డ్రైనేజీ కాలువలు



**మహానంది సెప్టెంబర్ 20 (నంది పత్రిక)** మహానంది మండలంలో తిమ్మాపురం, మహానంది,అబ్బీపురం, బుక్కాపురం సహా పలు గ్రామాల్లో తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది.గత కొన్ని రోజులుగా ఎల్నినో ప్రభావంతో వర్షాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రజలకు ఈ వర్షం పెద్ద ఉపశమనం కలిగించింది. గంటకు పైగా కురిసిన ఈ వర్షం 44 మిల్లీమీటర్ల వర్షపాతంగా నమోదయింది.చాలా రోజుల తర్వాత కురిసిన ఈ వర్షం పంట పొలాలకు ఎంతో మేలు చేస్తుందని,ఎండిపోతున్న పంటలకు జీవం పోస్తుందని రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.భూమిలో తేమ పెరిగి, భూగర్భ జలాలు పుంజుకుంటాయని ఆశాభవం వ్యక్తం చేస్తున్నారు.భారీ వర్షానికి తిమ్మాపురం, గాజులపల్లె, తదితర గ్రామాల్లో డ్రైనేజీ కాలువలు పొంగిపొర్లి ప్రవహించాయి. కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి నీరు ప్రవహించేందుకు వీలు లేక ఈ పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



## కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించండి

### సెప్టెంబర్ 24 25 తేదీ లో గ్రామ సచివాలయాల ముందు జరిగే ధర్నాలను జయప్రదం చేయండి



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, కరువు సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24, 25 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా సిపిఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గ్రామ సచివాలయాల ముందు జరిగే ఆందోళనలు జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, కె రామాంజనేయులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి రామచంద్రయ్యలు పిలుపునిచ్చారు. ఆదివారం నాడు స్థానిక సి.ఆర్.భవన్ నందు సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం కార్యవర్గ సభ్యులు జి. చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో పాల్గొన్న రామాంజనేయులు, రామచంద్రయ్యలు మాట్లాడుతూ తీవ్ర వర్షా బావ పరిస్థితుల వల్ల సకాలంలో వర్షాలు పడక జిల్లా వ్యాప్తంగా తీవ్ర కరువు తాండవిస్తుందని, దీనివల్ల రైతులు కౌలు రైతులు,వ్యవసాయ కూలీలు ఉపాధి లేక ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వలసలు వెళ్తున్నారని ఆవేదన చెందారు, రాష్ట్రంలో పశువులకి కనీసం గ్రాసం దొరకక రైతులు వారి పశువు చౌక ధరకు అమ్ముకునే పరిస్థితి దాపురించిందని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించడంతోపాటు కరువును జాతీయ విపత్తుగా ప్రకటించి కేంద్ర ప్రభుత్వం నుండి అధిక నిధులు రాబట్టే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ చూపాలని వారి డిమాండ్ చేశారు.కరువు విలయతాండవం చేస్తున్న, ప్రజాప్రతినిధులు రాష్ట్ర ముఖ్యమంత్రి కరువు గురించి పట్టించుకోవడానికి తీరిక లేకపోవడం బాధాకరమని, కరువు సహాయ చర్యలను చేపట్టాలని జిల్లా ప్రజలను, రైతులని ఆదుకోవాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ), అనుబంధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 24,25 తేదీల్లో గ్రామ సచివాలయాల ముందర ఆందోళనకు పిలుపునివ్వడం జరిగిందని ఈ ఆందోళనలో అధిక సంఖ్యలో రైతు సోదరులు ప్రజలు,సిపిఐ శ్రేణులు రైతులు వ్యవసాయ కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్. మునెప్ప,ఎన్.లెనిన్ బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె జగన్నాథం, రాజా సాహెబ్,లలితమ్మ, శ్రావణి, భాస్కర్, సుదర్శన్,రాజు,విరుపాక్షి కారుమంచి, రంగన్న కె.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## నదుల స్వచ్ఛతకు సహకరించండి

### పారిశుద్ధ్య కార్మికుల అవగాహన ర్యాలీ

### చెత్త వేయొద్దంటూ హోరెత్తించిన నినాదాలు




**కర్నూల్ సిటీ నంది పత్రిక** కేసీ కెనాల్ స్వచ్ఛతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరుతూ నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశాల మేరకు ఆదివారం పారిశుద్ధ్య కార్మికులు కేసీ కెనాల్ వెంట అవగాహన ర్యాలీ నిర్వహించారు. "వెయ్యొద్దు.. వెయ్యొద్దు.. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు" అంటూ నినాదాలు హోరెత్తిస్తూ పరిసర ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించారు. నదులు, కాలువలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. కేసీ కెనాల్‌లో చెత్త, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం వల్ల పరిసరాలు కలుషితమై ప్రజారోగ్యంపై ప్రభావం పడటంతో పాటు నీటి జీవులకు కూడా హాని కలుగుతుందని వివరించారు.నదులు మనవి.. నీటి జీవుల ప్రాణాల బాధ్యత మనది.. నదులను కలుషితం చేస్తే.. ముప్పు మనకే! అంటూ ప్రజలకు వినూత్నంగా వివరించారు. కేసీ కెనాల్ పరిసర ప్రాంతాల్లో చెత్త వేయకుండా, తడిపొడి చెత్తను వేర్వేరుగా అందించాలని ప్రజలను కోరారు. నదులు, కాలువల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు. నగరపాలక సంస్థ పారిశుద్ధ్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.కాగ, నదులు, కాలువలను పరిశుభ్రంగా ఉంచేందుకు నగరపాలక సంస్థ నిరంతరం చర్యలు చేపడుతోందని కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించి చెత్తను నీటి వనరుల్లో వేయకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో సానిటరీ ఇంస్పెక్టర్ హుస్సేన్, సెక్రటరీలు, ు పాల్గొన్నారు.

## రింగ్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి

### డిసెంబర్ కు రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తి... మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

### రింగ్ రోడ్డు పూర్తితో బనగానపల్లె పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం: మంత్రి

**బనగానపల్లె సెప్టెంబర్ 20నందిపత్రిక** బనగానపల్లె పట్టణం లో ట్రాఫిక్ సమస్యను తొలగించేందుకు మంత్రి బీసి జనార్ధన్ రెడ్డి రింగ్ రోడ్డు ను మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో రోడ్డునిర్మాణ పనులు మొదలై కొన సాగుచున్నాయి. ఆదివారం ఈ పనులను రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాయిబాబా ఆలయం నుంచి రవ్వలకొండ వరకు కొనసాగుతున్న రింగ్ రోడ్డు పనులను పరిశీలించిన మంత్రి.. పనుల పురోగతి, ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.రింగ్ రోడ్డు నిర్మాణ పనులు ఇప్పటికే దాదాపు 80 శాతం పూర్తయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. రూ.56 కోట్ల అంచనా వ్యయంతో 10.68 కి.మీ. పొడవున నిర్మిస్తున్న ఈ రింగ్ రోడ్డు పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. మిగిలిన పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తయితే బనగానపల్లె పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా భారీ వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులోకి రావడంతో పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని పేర్కొన్నారు. అనంతరం మంత్రి బనగానపల్లె పట్టణంలోని ప్రధాన కూడళ్లను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీకి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలు, వాహనాల రాకపోకల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.



## వినాయక పూజలో పాల్గొని.. భక్తులకు అన్నదానం చేసిన పాణ్యం మాజీ ఏమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి



**కర్నూలు సిటీ నందిపత్రిక** కల్లూరు అర్బన్ పరిధిలోని 34వ వార్డు గీతానగర్ రోడ్ నెం.3లో శ్రీ వరసిద్ధి వినాయక భక్త బృందం వారి ఆహ్వానం మేరకు వినాయక మండపాన్ని సందర్శించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కల్లూరు అర్బన్ 35వ వార్డు ముజఫర్ నగర్ ఆటో స్టాండ్ వద్ద జై బాలగణేష్ భక్త బృందం వారి ఆహ్వానం మేరకు వినాయక పూజ కార్యక్రమంలో పాల్గొని, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులకు స్వయంగా అన్నం వడ్డించి, వారితో ఆప్యాయంగా మమేకమయ్యారు.వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని కాటసాని రామభూపాల్ రెడ్డి ఆకాంక్షించారు.

## ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ పీఠం ఎస్సీలకే అవకాశం కల్పించాలి

### ఇప్పటివరకు చైర్మన్ పీఠం దళితులకు కేటాయింపు జరగలేదు

### మున్సిపల్ పరిధిలో వార్డు కౌన్సిలర్ సీట్లు ఎస్సీలకు అధిక శాతం పెంచాలి

### రాష్ట్రమాల మహానాడు డిమాండ్



**నంది పత్రిక ఆత్మకూరు..** రాష్ట్రశీలో త్వరలో జరగబోయే పురపాలక సంఘం, నగర పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు, జరిపించేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది ఈ నేపథ్యంలోనే నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్మన్ పీఠం ఎస్సీలకే కూటమి పాలకులు అవకాశం కల్పించే విధంగా చొరవ తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు పెరుమాళ్ళ చెన్నకేశవులు మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మురహరి మల్లయ్య ఆత్మకూరు తాలూకా మాల మహానాడు సీనియర్ నాయకులు ప్రాతకోట రమేష్ ఆత్మకూరు తాలూకా ఉపాధ్యక్షులు సీనియర్ పాత్రికేయులు సగినేల రవికుమార్, ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ స్ఫూర్తి కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ ఆత్మకూరు పురపాలక సంఘంలో ఇప్పటివరకు ఎస్సీలకు ఏ పాలకులు కూడా చైర్మన్ గా అవకాశం కల్పించలేదు వీటితోపాటు పట్టణంలో 32 వార్డులలో ఎస్సీలకే అధిక సీట్ల ప్రాధాన్యత కల్పించి కూటమిపాలనలోనైనా రిజర్వేషన్ ప్రకారంగా ఎస్సీలకే చైర్మన్ పీఠం కేటాయించాలని మాల మహానాడు కమిటీ నాయకులు డిమాండ్ చేశారు ఇదివరకే ఓసి బిసి మైనార్టీ వారు చైర్మన్ పీఠం ఇదివరకు కేటాయించారు ఆత్మకూరు మేజర్ గ్రామపంచాయతీ ఏర్పడినప్పటి నుండి ఇంతవరకు ఎస్సీలకు సర్పంచ్ గాని చైర్మన్గా గాని అవకాశాలు కల్పించలేదు 2024 అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం గెలుపు కోసం మాల మహానాడు ఎంతో కృషి చేసింది రాజకీయంగా అప్పుడు ఇచ్చిన మాట ప్రకారం గా ఎస్సీలకు రాజకీయంగా అవకాశాలు కల్పిస్తామని కూటమి ప్రభుత్వ నేతలు హామీ ఇచ్చారు ఇచ్చిన మాట ప్రకారంగానే ఆత్మకూరు మున్సిపాలిటీలో చైర్మన్ పీఠం ఎస్సీలకే కేటాయించాలని మాలమహానాడు నాయకులు పత్రికా ముఖంగా తెలియజేశారు

## 'గుండ్రేవుల'ను సాధించి తీరుతాం

### కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.శ్రీహర్ష

### గుండ్రేవుల ప్రాజెక్టు సాధనకు సంతకాల సేకరణ



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు జిల్లాకు జీవనాడి అయిన గుండ్రేవుల ప్రాజెక్టును సాధించి తీరుతామని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.శ్రీహర్ష ఉద్ఘాటించారు. ఆదివారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని కేపీఎస్ కార్యాలయంలో గుండ్రేవుల ప్రాజెక్టు సాధనకై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీహర్ష మాట్లాడుతూ.. గుండ్రేవుల ప్రాజెక్టు సాధించే వరకు రాజీ లేకుండా తమ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కర్నూలు నగరంలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి సైతం నీరు లేని పరిస్థితి ఏర్పడిందని, జిల్లాలో నీటి నిల్వకు సరైన ప్రాజెక్టులు లేకపోవడం వల్లే ఇటువంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని అన్నారు.జిల్లాలో వ్యవసాయానికి, తాగునీటికి, పారిశ్రామిక అవసరాలకు, నీటి వనరులను సమృద్ధిగా అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కర్నూలు జిల్లాలో నీటి కొరతను శాశ్వతంగా అధిగమించాలంటే గుండ్రేవుల ప్రాజెక్టును సాధించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.గుండ్రేవుల ప్రాజెక్టు కోసం ప్రజలంతా భాగస్వాములు కావాలని శ్రీహర్ష పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరి సంతకం ఈ ఉద్యమానికి బలాన్ని చేకూరుస్తుందని, ప్రజల ఆకాంక్షను ప్రభుత్వానికి బలంగా తెలియజేసేందుకు పెద్ద ఎత్తున సంతకాలు సేకరించి ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. కర్నూలు జిల్లా భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించాలంటే గుండ్రేవుల ప్రాజెక్టు ఎంతో కీలకమని, ప్రాజెక్టు సాధన కోసం ప్రజలతో కలిసి నిరంతరం ఉద్యమిస్తామని శ్రీహర్ష స్పష్టం చేశారు.



# గణనాథుల నిమజ్జనానికి సర్వం సిద్ధం

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**

**ఏర్పాట్లు పూర్తి చేసిన నగరపాలక యంత్రాంగం**

**మూడు ప్రాంతాల్లో నిమజ్జనానికి 15 క్రేన్లు**

**అధికార యంత్రాంగానికి భక్తులు సహకరించాలి**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలో ఈ నెల 22న అత్యంత వైభవంగా జరగనున్న వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. ఆదివారం ఆయన కె.సి. కెనాల్ వినాయక ఘాట్, నన్నూరు టోల్‌గేట్ సమీపంలో, ఉల్లిందకొండ వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ ఘాట్‌లలో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వినాయక విగ్రహాల నిమజ్జనానికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మూడు ప్రాంతాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. విగ్రహాలను సురక్షితంగా నిమజ్జనం చేసేందుకు కె.సి. కెనాల్ వినాయక ఘాట్ వద్ద 7, నన్నూరు టోల్‌గేట్ సమీపంలో 6, ఉల్లిందకొండ వద్ద 2 చొప్పున మొత్తం 15 క్రేన్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్, లైటింగ్, బారికేడింగ్, మైక్ అనౌన్స్‌మెంట్స్, డబ్ల్యూబీఎం రహదారుల నిర్మాణం, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు, నగరపాలక సిబ్బందిని సైతం అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. కె.సి. కెనాల్ వినాయక ఘాట్ వద్ద నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టామని, ప్రస్తుతం అక్కడ 9 అడుగుల ఎత్తులో నీరు నిల్వ ఉన్నట్లు కమిషనర్ తెలిపారు. నన్నూరు టోల్‌గేట్ సమీపంలో, ఉల్లిందకొండ వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ ఘాట్‌లో కూడా భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. నిమజ్జన సమయంలో భక్తులు అధికార యంత్రాంగానికి సహకరించాలని కమిషనర్ కోరారు. విగ్రహాలను నిమజ్జన ప్రాంతాలకు తీసుకువచ్చే సమయంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా అధికారుల సూచనలు పాటిస్తూ క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బారికేడ్లు, సూచనలను పాటించాలని, క్రేన్ల వద్దకు అనవసరంగా వెళ్లకుండా సిబ్బందికి సహకరించాలని కోరారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిమజ్జన ప్రాంతాల్లో పారిశుద్ధ్య సిబ్బంది, అధికారులను అందుబాటులో ఉంచి నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. గణనాథుల నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, డిఈఈ నరేష్, సానిటరీ ఇంస్పెక్టర్ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.



## మల్యాల రామలక్ష్మమ్మను పరామర్శించిన బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

**డోన్ : నంది పత్రిక సెప్టెంబర్ 20** రాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పార్టీ సీనియర్ నాయకులు డోన్ మండలం మల్యాల గ్రామం భాస్కర్ రెడ్డి సతీమణి, మల్యాల మాజీ సర్పంచ్ రామలక్ష్మమ్మ ని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా రామలక్ష్మమ్మ వారి ఆరోగ్య పరిస్థితి, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. మల్యాల భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కొద్దిసేపు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ఎంపీపీ రేగటి రాజశేఖరరెడ్డి, పోస్ట్ ప్రసాద్ మరియు నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## రేపు నగరపాలకలో అర్జీల స్వీకరణ

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరపాలక సంస్థలో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చల్లా ఓబులేసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:00 గంటలకు స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నగరపాలక సంస్థకు చెందిన అన్ని విభాగాల అధికారులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. కాలనీల్లో మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, పరిశుభ్రత తదితర సమస్యలను ప్రజలు లిఖితపూర్వకంగా సమర్పించవచ్చని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు రాలేని పౌరులు 7422992299 నంబర్‌కు కాల్ చేయడం లేదా వాట్సాప్ సందేశం ద్వారా తమ ఫిర్యాదులను తెలియజేయవచ్చని కమిషనర్ సూచించారు.

## వైఎస్ఆర్సిపి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ భేరి మోగించాలి.

**మాజీ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి పిలుపు.**



**బేతంచెర్ల సెప్టెంబర్ 20 ( నంది పత్రిక ).** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పాలక పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని,మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తమ, క్యాడర్ కు పిలుపునిచ్చారు. ఆదివారం నాడు బేతంచెర్ల పట్టణంలోని శ్రీ చౌడేశ్వరి దేవి ఫంక్షన్ హాల్ లో జరిగిన వైఎస్ఆర్సిపి కార్యకర్తల మండల విస్తృతస్థాయి సమావేశంనకు ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాధ్ రెడ్డిమాట్లాడుతూ,రానున్న స్థానిక ఎన్నికలలో మన వైఎస్ఆర్సిపి విజయభేరి మోగిద్దాం అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేసి,పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని,ప్రజల్లోకి వెళ్లి పార్టీ విధానాలను వివరించాలని నాయకులకు సూచించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి నాయకులకు , కార్యకర్తలకు ఐడి కార్డులను పంపిణీ చేశారు. పంపిణీ చేయడం ద్వారా ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు,గౌరవం దక్కుతుందని ఆయనతెలిపారు.ప్రస్తుతం ఐడి కార్డులు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి,భవిష్యత్తులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినవెంటనే తగిన గుర్తింపు,బాధ్యతలు లభిస్తాయని తెలిపారు.వైఎస్ఆర్సిపి అధ్యకులు,మాజీ ముఖ్య మంత్రి శ్రీ వైయస్.జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో పార్టీ కోసం కష్ట పడదామని, పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు భవిష్యత్తులో తగిన గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బేతంచెర్ల మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు బుగ్గన నాగభూషణం రెడ్డి,బేతంచెర్ల నగర పంచాయితీ చైర్మన్ సిహెచ్.చలంరెడ్డి, మండల వైసీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి,రాష్ట్ర గిడ్డంగుల మాజీ డైరెక్టర్ బాబు రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ ముర్తుజావలి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఖాజా హుస్సేన్,శ్రీ మద్దులేటి స్వామి ధర్మ కర్తల మండలి మాజీ చైర్మన్లు సిహెచ్.లక్ష్మిరెడ్డి, బీరవోలు నాగేశ్వర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సీతా రామ చంద్రుడు,వైసిపి మండల కన్వీనర్ కుంచ తిరుమలేశ్వర రెడ్డి,నంద్యాల జిల్లా అధికార ప్రతినిధి పుసులూరు మురళీకృష్ణ,బేతంచెర్ల టౌన్ కన్వీనర్ పిట్టల జాకీర్ హుస్సేన్, అన్ని కమిటీల సభ్యులు,కౌన్సిలర్లు,మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు,మాజీ ఎంపీటీసీలు, మాజీ వార్డు మెంబర్లు,మండల వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పార్టీ సానుభూతి పరులు,పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.




## తాగిన మత్తులో భార్యపై కొడవలితో భర్త దాడి.

**వెలుగోడు, సెప్టెంబర్ 20 (నంది పత్రిక):** వెలుగోడు మండలంలోని అబ్దుల్లాపురం గ్రామంలో శనివారం రాత్రి కుటుంబ కలహాల కారణంగా తాగిన మత్తులో భార్యపై భర్త కొడవలితో దాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్.ఐ బి. సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన దూదేకుల చిన్న మౌలాలి, మద్యం మత్తులో తన భార్య దూదేకుల దర్వేశి బీపై కొడవలితో దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె రెండు చేతుల వేళ్లకు, ఎడమవైపు పొట్ట భాగంలో తీవ్ర రక్తగాయాలయ్యాయి. బాధితురాలి కూతురు దుర్వేసి ఆస్మా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. గాయపడిన దర్వేశి బీకి వెలుగోడు ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం, మెరుగైన వైద్యం కోసం నంద్యాల ఆసుపత్రికి తరలించినట్లు ఎస్.ఐ వెల్లడించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

## వర్షం రాకతో ఊపిరి పీల్చుకున్న రైతన్నలు మండలవ్యాప్తంగా హర్షాతిరేకాలు

**తెల్లవారుజాము నుంచే జోరుగా కురిసిన వర్షం**

**52.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు**



**వెలుగోడు, సెప్టెంబర్ 20 (నంది పత్రిక):** బంగాల్ ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండల వ్యాప్తంగా కురిసిన ఒక మోస్తరు వర్షం రైతుల్లో కొత్త ఆశలు చిగురింపజేసింది. గత కొన్ని రోజులుగా సరైన వర్షాలు లేక ఎండిపోయే దశకు చేరిన పంటలకు ఈ వర్షం ఎంతగానో మేలు చేస్తుందని రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు మండలవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షం జోరుగా కురిసింది. రెవెన్యూ అధికారుల సమాచారం ప్రకారం మండలంలో రికార్డు స్థాయిలో 52.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. ఈ సమయానికి కురిసిన వర్షం వల్ల మెట్ట పంటలు, పైర్లు తిరిగి జీవం పోసుకుంటాయని, ఎండిపోతున్న చేన్లకు ఈ వర్షం అమృతంలా ఉపయోగపడుతుందని స్థానిక రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## వినాయకుడి పూజా కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ నాయకులు

**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూల్ అర్బన్ 38,40వ వార్డు, బాలాజీ నగర్, గీతా ముఖర్జీ నగర్, సంతోష్ నగర్ యూత్ ఆహ్వానం మేరకు నిర్వహించిన వినాయక పూజ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మాజీ కుడా చైర్మన్, కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి , కోడుమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇంచార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ , మాజీ కార్పొరేటర్ విక్రం సింహారెడ్డి ,వై.మదిలేటిపలు ముఖ్య నాయకులు పాల్గొని, శ్రీ వరసిద్ధి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించాము . ఆ విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితంలో విఘ్నాలు తొలగి సుఖసంతోషాలు, విజయాలు కలగాలని ప్రార్థించాము. అదేవిధంగా సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు పుష్కలంగా పండాలని, రైతుల జీవితాల్లో ఆనందం, అభివృద్ధి వెల్లివిరియాలని ఆ గణనాథుడిని వేడుకున్నాము. రాష్ట్ర ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు. ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులతో అందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, శ్రేయస్సు నిండాలని కోరుకుంటున్నాము.



## ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాల నూతన ఇన్చార్జి పి వి మోహన్ ని కలిసిన కర్నూలు డిసిసి అధ్యక్షులు అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ



**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్చార్జి, ఎమ్మెల్సీ పివి మోహన్ ని విజయవాడ ఆంధ్రరత్న భవన్ రాష్ట్ర కార్యాలయంలో కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, పత్తికొండ ఇన్చార్జి అడ్వకేట్ బోయ క్రాంతి నాయుడు ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా కాంగ్రెస్ అనుబంధ విభాగాల జిల్లా చైర్మన్లు మరియు నాయకుల బృందం కలిసి మోహన్ ని శాలువాలతో, కండువాలతో ఘనంగా సన్మానించి మెమొంటోను అందజేశారు. మంత్రాలయం నియోజకవర్గానికి చెందిన యువ నాయకుడు ఆర్సీ యువరాజు గారికి పీవీ మోహన్ పార్టీ కండువా వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. అనంతరం మోహన్ కి కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న వివిధ కార్యక్రమాలను మరియు కొందరు కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగే విధంగా వ్యవహరిస్తున్న తీరును జిల్లా నాయకుల బృందం వివరంగా తెలియజేసింది. మోహన్ సానుకూలంగా స్పందించి జిల్లాతో సంబంధం లేని కొందరు జోక్యం చేసుకుంటున్నారని అలాగే పార్టీకి నష్టం కలిగే విధంగా కొందరు వ్యవహరిస్తున్నారని నా దృష్టికి వచ్చిందని కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగించే విధంగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని త్వరలో కర్నూలు జిల్లాకు వస్తానని స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ బలోపేతం వివిధ అంశాల మీద కృషి చేద్దాం అని క్రాంతి నాయుడు కి సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్సి బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఏ సూర్య ప్రకాష్ రెడ్డి, మంత్రాలయం కాంగ్రెస్ నాయకులు ఆర్ సి యువరాజ్ ముస్లిం మైనార్టీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి వశీ భాష, జిల్లా కాంగ్రెస్ నాయకులు చిన్న స్వామి మొదలగు నియోజకవర్గాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నేడు జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారమే లక్ష్యం**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, సెప్టెంబరు 20(నంది పత్రిక):–** జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు నేడు జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ డివిజన్, మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వినతులను పరిశీలించి, నిబంధనల మేరకు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని, అర్జీల పరిష్కార స్థితిని టోల్‌ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు. ముందుగా మండల, రెవెన్యూ డివిజన్ లేదా మున్సిపల్ స్థాయిలో సమస్యలను పరిష్కరించుకోవాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలను జిల్లా స్థాయి పీజీఆర్ ఎస్ లో సమర్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించాలని ఆదేశించారు.

# 25 నుంచి జిల్లా పరిషత్‌కు ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్

**ప్రస్తుత జిల్లా పరిషత్ పాలకవర్గం పదవీకాలం 24వ తేదీతో ముగింపు**

**ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లా పరిషత్ పరిపాలనా బాధ్యతలు స్వీకరించనున్న కలెక్టర్**

**నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 20(నంది పత్రిక):–** ప్రస్తుత జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీకాలం సెప్టెంబర్ 24, 2026తో ముగియనున్న నేపథ్యంలో, సెప్టెంబర్ 25వ తేదీ నుంచి జిల్లా పరిషత్‌ల పరిపాలనను కొనసాగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి (ఎన్నికలు–నియమాలు) శాఖ జి .ఓ .ఎం ఎస్ .నెంబర్ .129, తేదీ: 19–09–2026 జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం, 1994లోని సెక్షన్ 250–ఏ (1) కింద, నంద్యాల జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ జి. రాజకుమారిని నంద్యాల జిల్లా పరిషత్‌కు ప్రత్యేక అధికారిగా (స్పెషల్ ఆఫీసర్ ) నియమించింది. ఈ నియామకం సెప్టెంబర్ 25, 2026 నుంచి ఆరు నెలల కాలానికి లేదా ఎన్నికైన జిల్లా పరిషత్ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్ తదితర పదవీ బాధ్యతలు స్వీకరించే తేదీ వరకు అమల్లో ఉంటుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు జిల్లా పరిషత్‌కు సంబంధించిన పరిపాలనా వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజలకు అందాల్సిన సేవలు, అభివృద్ధి కార్యక్రమాలు ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా పరిషత్ పరిధిలోని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో శాఖల మధ్య సమన్వయంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. మండల పరిషత్‌ల విషయానికి వస్తే, ప్రస్తుత మండల పరిషత్ పాలకవర్గాల పదవీకాలం కూడా సెప్టెంబర్ 24తో ముగియనున్న నేపథ్యంలో, సెప్టెంబర్ 25 నుంచి సంబంధిత మండల పరిషత్‌ల పరిపాలన కొనసాగింపునకు ప్రభుత్వం జారీ చేసే తదుపరి ఉత్తర్వుల మేరకు ప్రత్యేక అధికారుల ద్వారా పరిపాలన కొనసాగనుంది.



# మతిమరుపును నిర్లక్ష్యం చేయొద్దు

### ముందుగానే గుర్తిస్తే మరింత మేలు

### డాక్టర్ చల్లెపల్లి బాబూరావు, కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ కిమ్స్ హాస్పిటల్స్



**కర్నూలు సిటీ నంది పత్రిక** అల్జీమర్స్ వ్యాధి అనేది ఒక ముఖ్యమైన మతిమరుపు వ్యాధి. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది డిమెన్షియాతో జీవిస్తున్నారు. వయస్సు పెరిగేకొద్దీ మతిమరుపు సహజమేనని చాలామంది భావించి ప్రారంభ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తుంటారు. అయితే రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేసే మతిమరుపును సాధారణ వృద్ధాప్యంగా భావించకూడదు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 21న ప్రపంచ అల్జీమర్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ ఏడాది ప్రధానంగా అల్జీమర్స్, డిమెన్షియాను ముందుగానే గుర్తించడం, సరైన నిర్ధారణ చేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఏ వయస్సు వారిలో వస్తుంది?మతిమరుపు జబ్బుల్లో అల్జీమర్స్ అనే వ్యాధి చాలా ముఖ్యమైనది. సాధారణంగా వయస్సు పెరిగే కొద్దీ ఈ వ్యాధి వచ్చే అవకాశం పెరుగుతుంది. అయితే ఇది కేవలం వృద్ధులకు మాత్రమే పరిమితమైన వ్యాధి కాదు. కొన్ని సందర్భాల్లో 4050 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తుల్లో కూడా అల్జీమర్స్ వ్యాధి కనిపించవచ్చు. అల్జీమర్స్ వ్యాధికి కారణాలు మెదడులోని నాడీ కణాలలో అమిలాయిడ్ బీటా పెప్టైడ్స్ పేరుకుపోవడం, అలాగే ఇతర నాడీ సంబంధిత మార్పుల వల్ల క్రమంగా నాడీకణాల పనితీరు దెబ్బతిని వ్యాధి లక్షణాలు ప్రారంభమవుతాయి. అధిక రక్తపోటు, డయాబెటిస్, అధిక కొలెస్ట్రాల్, పొగాకు అలవాటు, ఊబకాయం, గుండె సంబంధిత సమస్యలు, బ్రెయిన్ స్ట్రోక్ వంటి అంశాలు డిమెన్షియా ప్రమాదాన్ని పెంచే అంశాలుగా ఉండవచ్చు. జన్యుపరమైన కారణాలు కూడా కొందరిలో పాత్ర పోషిస్తాయి. కొన్ని రకాల మందులు, ముఖ్యంగా నిద్ర మాత్రలు, యాంటీకోలినర్జిక్ మందులు, జ్ఞాపకశక్తిపై ప్రభావం చూపవచ్చు. అందువల్ల వైద్యుల సలహా లేకుండా దీర్ఘకాలం మందులు వాడకూడదు.

**వ్యాధి లక్షణాలు** వ్యాధి ప్రారంభ దశలో బాగా తెలిసిన ప్రాంతాలు లేదా తెలిసిన పదాలను మర్చిపోవడం, వస్తువులను పోగొట్టుకోవడం లేదా తప్పుగా పెట్టడం, ఇటీవల కలుసుకున్న వారిని కూడా మర్చిపోవడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. జబ్బు తీవ్రత పెరిగేకొద్దీ అప్పుడే జరిగిన సంఘటనలు లేదా వ్యక్తిగత వివరాలు మర్చిపోవడం, గందరగోళానికి గురికావడం, కుటుంబ సభ్యులు, బంధువుల ముఖాలను గుర్తించడంలో ఇబ్బంది కలగవచ్చు. మరింత తీవ్రమైన దశలో మూత్ర నియంత్రణ కోల్పోవడం, సాధారణ సంభాషణలకు ప్రతిస్పందించడం తగ్గిపోవడం, రోజువారీ జీవితం కోసం ఇతరులపై పూర్తిగా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు.

**నిర్ధారించడం ఎలా?** అల్జీమర్స్ వ్యాధిని నిర్ధారించడానికి రోగి లక్షణాలు, కుటుంబ సభ్యులు తెలిపే వివరాలు, క్లినికల్ పరీక్షలు ముఖ్యమైనవి. అవసరాన్ని బట్టి బ్రెయిన్ ఇమేజింగ్ పరీక్షలు చేస్తారు. ఎంపిక చేసిన రోగుల్లో ప్రత్యేక పరీక్షలు, బయోమార్కర్లు లేదా అమైలాయిడ్ పి ఇ టీ స్కాన్ వంటి పరీక్షలు అవసరం కావచ్చు. మతిమరుపునకు అల్జీమర్స్ కాకుండా ఇతర కారణాలు కూడా ఉండవచ్చు. అందువల్ల మతిమరుపు కనిపించిన ప్రతి ఒక్కరినీ అల్జీమర్స్ రోగిగా భావించకుండా సరైన వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

**చికిత్స...** అల్జీమర్స్ వ్యాధి చికిత్స రోగి దశ, లక్షణాలు, ఆరోగ్య పరిస్థితిని బట్టి నిర్ణయిస్తారు. ప్రారంభ దశలోనే గుర్తించడం వల్ల రోగికి అవసరమైన చికిత్స, కుటుంబ సభ్యుల సహకారం, భవిష్యత్ సంరక్షణను ముందుగానే ప్రణాళిక చేసుకునే అవకాశం ఉంటుంది. లక్షణాలను నియంత్రించేందుకు కోలినెస్టరేజ్ ఇన్హిబిటర్స్, మెమంటైన్ వంటి మందులను వైద్యుల పర్యవేక్షణలో ఉపయోగిస్తారు. ఇటీవలి కాలంలో ఎంపిక చేసిన ప్రారంభ దశ అల్జీమర్స్ రోగుల్లో అమైలాయిడ్ ను లక్ష్యంగా చేసుకునే చికిత్సలు కూడా అందుబాటులోకి వచ్చాయి. అవసరాన్ని బట్టి మానసిక వైద్య నిపుణుల సహకారం, ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, కుటుంబ సభ్యుల సహకారం కూడా ఉపయోగపడతాయి.

**నివారణ...** అల్జీమర్స్‌ను పూర్తిగా నివారించే నిరూపితమైన ఒకే మార్గం లేదు. అయితే మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కొన్ని జీవనశైలి మార్పులు ఉపయోగపడతాయి. ధూమపానం, అధిక మద్యపానానికి దూరంగా ఉండటం, బీపీ, షుగర్, కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం, మెదడును చురుకుగా ఉంచే కార్యకలాపాలు చేయడం మంచిది.

## ఐటా' ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం



**వెలుగోడు, సెప్టెంబర్ 20 (నంది పత్రిక):**ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ నంద్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. సమాజ వికాసంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన వారిని గౌరవించుకోవడం అభినందనీయమని ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెలుగోడు పట్టణానికి చెందిన కె. షంషుద్దీన్ (పాములపాడు మండల ఐఈఆర్టీ స్పెషల్ ఉపాధ్యాయుడు) ఇటీవలి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 'జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు' అందుకున్నందుకు, అలాగే లిటిల్ ఏంజిల్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో హిందీ ఉపాధ్యాయునిగా సేవలందిస్తున్న సలీంను 'ఐటా' ప్రతినిధులు శాలువా, పూలమాలలు, జ్ఞాపిక (మెమొంటో)లతో ఘనంగా సత్కరించారు. వీరితో పాటు విద్యాబోధనలో విశేష సేవలు అందించిన మరో ఏడుగురు ఉపాధ్యాయులను కూడా సంస్థ తరఫున సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐటా రాష్ట్ర అధ్యక్షుడు చాంద్ బాషా, జమాతే ప్రెసిడెంట్ అబ్దుల్ సమద్, జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ సలీం, కార్యదర్శి ఇర్ఫాన్ బాషా, ఉపాధ్యక్షుడు అబ్దుల్ సుకుర్, వెలుగోడు మండల అధ్యక్షుడు ఫయాజ్ అలీ ఖాన్ మరియు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన పలువురి సేవలను కొనియాడుతూ బంధుమిత్రులు, తోటి ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు వారికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## ప్రధమనంది బ్రిడ్జి వద్ద కుంగిన రోడ్డును క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్





**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 20 (నంది పత్రిక )** నంద్యాల పట్టణంలో ఈరోజు కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రధమనందికి వెళ్లే బ్రిడ్జిని ఆనుకుని ఉన్న రోడ్డు ఒకవైపు కోతకు గురై కూలిపోయింది. ఈ విషయం దృష్టికి వచ్చిన వెంటనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ తక్షణమే స్పందించి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ దెబ్బతిన్న రోడ్డు భాగాన్ని పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. భారీ వర్షాలతో నీటి ప్రవాహం పెరిగి రోడ్డు మార్జిన్ కోతకు గురైందని గుర్తించిన ఆయన, వాహనదారులకు మరియు ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే యుద్ధప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని, అనంతరం పటిష్టమైన శాశ్వత రక్షణ గోడ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత శాఖ ఇంజనీరింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు. వర్షాల దృష్ట్యా ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధమనంది దేవస్థానం చైర్మన్ చలం బాబు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## "నంద్యాల దేవనగర్‌లో ఘనంగా ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభం - ..ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయడమే లక్ష్యం: ఫిరోజ్"





**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 20 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని 26వ వార్డు దేవనగర్‌లో హాస్టల్ ఆవరణలో తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్ జల్లిపల్లి దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో శ్యామల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్త సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ ముఖ్య అతిథిగా హాజరై, తన చేతుల మీదుగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వివిధ వైద్య విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు శిబిరంలో పాల్గొని ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య సలహాలు, ఆరోగ్య సూచనలు అందించడంతో పాటు, ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు.ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ముందుకు వచ్చిన శ్యామల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యానికి, వైద్యులకు, 26వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు జల్లిపల్లి దిలీప్ కుమార్ బ్రదర్స్‌కు ఫిరోజ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్యులు, నిర్వాహకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





## యాదావిధిగా నేడు (సెప్టెంబర్ 21న) జిల్లా, డివిజన్, మండల కేంద్రాల లో ప్రజా సమస్యల పరిష్కా ర వేదిక

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం, బ్యూరో చీఫ్ సెప్టెంబర్20 నంది పత్రిక** జిల్లా ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంసెప్టెంబర్ 21వ తేదీన జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని డివిజన్ మరియు మండల కేంద్రాలలో నిర్వ హించబడు తుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారులి. అదేవిధంగా రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం కూడా నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను సంబంధిత ఆధార పత్రాలతో సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అర్జీల స్వీకరణ, పరిశీలన మరియు పరిష్కార ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా మరియు మండల స్థాయి అధికారుల సమన్వ యంతో ప్రత్యేక ఏర్పాట్లు చేయబడి నట్లు తెలిపారు. అర్జీదారులు తమ ఫిర్యాదులను అధికారిక వెబ్‌సైట్ ఎవవఎశీఖఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ ద్వారా కూడా నమోదు చేసుకో వచ్చని తెలిపారు. అర్జీల స్థితి, పరిష్కా ర ప్రక్రియ లేదా ఇతర సమాచారం కోసం "మీకోసం" టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100 ను సంప్ర దించవచ్చని సూచించారు. క్యూఆర్ కోడ్ ను ఉపయోగించుకొని మీరు పెట్టుకున్న అర్జీ నెంబర్ కి ఫీడ్ బ్యాక్ ఇస్తే, తదుపరి సంబంధిత అధికారి మిమ్మల్ని సంప్రది స్తారని అన్నారు. నడవలేని వారు, మంచానికే పరిమి తమైన వారు, తీవ్రమైన అనారో గ్యంతో బాధపడు తున్న వారిని పి.జి.ఆర్.ఎస్ కేంద్రాలకు తీసుకు రాలవద్దని తెలిపారు.అలాంటి వారి సమస్యలను కుటుంబ సభ్యులు లేదా ప్రతినిధుల ద్వారా తెలియ జేయవచ్చని పేర్కొన్నారు. పి.జి.ఆర్.ఎస్‌కు హాజరయ్యే ప్రజల కోసం తాగునీరు, అల్పాహారం, భోజనం వంటి సౌకర్యాలతో పాటు వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయబడినట్లు తెలిపారు. అందిన అర్జీలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, సమస్యల పరిష్కా రానికి తక్షణ చర్యలు తీసుకుంటా మని కలెక్టర్ స్పష్టం చేశారు.

## మఠం విజయభాస్కర్ కు గౌరవ డాక్టరేట్



**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 20 నంది పత్రిక** రంపచోడవరం ఎస్టీ నియోజకవర్గం రాజవొమ్మంగి మండలం కింద్ర పంచాయితీ అనంతగిరి గ్రామానికి చెందిన మఠం విజయభాస్కర్ డాక్టరేట్ పొందారు. దక్షిణాఫ్రికాలోని ఎపిక్రైజో ప్రాఫెటిక్ బైబిల్ యూనివర్సిటీ సామాజిక సేవలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ( పీహెచ్డీ. ) గౌరవ డాక్టరేట్ ను ప్రదానం చేసింది. సామాజిక సేవ, నాయకత్వ రంగాల్లో చేసిన సేవలను గుర్తిస్తూ ఈ గౌరవ పురస్కారం అందించారు. విశాఖపట్నంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మఠం విజయభాస్కర్ ఈ గౌరవం అందుకున్నారు. రంపచోడవరం శాసన సభ్యురాలు మిరియాల శిరీష దేవి భర్త అయిన మఠం విజయభాస్కర్ రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులుగా నియోజకవర్గంలో నాయికునిగా పని చేయడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేసి ప్రజల్లో మంచి గుర్తింపు పొందారు. ముఖ్యంగా సొంత వాహనాన్ని అంబులెన్స్ గా మార్చి గిరిజన ప్రాంతంలో ప్రజలకు ఉచిత సేవ అందిస్తున్నారు. అలాగే నియోజకవర్గంలో ఆసుపత్రుల నుండి రోగులు రాకపోకలు సాగించడానికి వీలుగా ఒక ఆటో ఏర్పాటు చేసి ఉచిత సేవలు అందిస్తున్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లో రక్షిత మంచినీటి సరఫరా లేని ప్రాంతాల్లో సొంత నిధులు నిధులతో పైప్ లైన్లు ఏర్పాటు చేసి గిరిజనులకు రక్షిత మంచినీరు అందించేందుకు ఆర్థిక సహాయాన్ని అందించారు. అలాగే రాజవొమ్మంగి తో సహా పలు ప్రాంతాల్లో బస్ షెల్టర్లు నిర్మించి ప్రజలకు నీడ కల్పించడానికి సొంత నిధులను వినియోగించారు. ఇంకా గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలోను, ఆర్థికంగా ఇబ్బందులు పడే వారికి ఆర్థిక సహాయం అందించి పలుసార్లు ఆదుకున్నారు. మఠం విజయ భాస్కర్ కు గౌరవ డాక్టరేట్ లభించడంపై నియోజకవర్గంలో పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ డాక్టర్ పెట్ల ప్రభాకర్ డాక్టర్ కె ఇందిరా ప్రియదర్శిని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అవధానుల మురళీకృష్ణ నొక్కు భాగ్యవతి తదితరులు పాల్గొన్నారు



## రైల్వే బోర్డు సభ్యులు ఏవీ రంగయ్య నివాసంలో ఆత్మీయ విందు

### పాల్గొన్న మంత్రి ఎన్ఎండి ఫరూక్, మిద్దె శివరామ్, ఎన్ఎండి ఫిరోజ్



**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 20 ( నంది పత్రిక )** రైల్వే బోర్డు సభ్యులు, నంద్యాల మాజీ బలిజ సంఘం అధ్యక్షులు ఏవీ రంగయ్య స్థానిక ఎస్బీఐ కాలనీలోని సాయి అపార్ట్‌మెంట్స్‌లో గల ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ విందు కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, ఆర్జీయం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ మిద్దె శివరామ్, తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏవీ రంగయ్య ముఖ్య అతిధులకు మరియు ఇతర ప్రముఖులకు సాదర స్వాగతం పలికారు. విందు అనంతరం ముఖ్య అతిథులను రంగయ్య మరియు వారి కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు . ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, పలువురు ముఖ్య నాయకులు, సన్నిహితులు తదితరులు పాల్గొన్నారు.



## అక్టోబర్ నెలాఖరు వరకు కేసీ కెనాల్ ఆయకట్టుకు నీరు విడుదల చేయాలని మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు గోస్పాడు మండలం యాలూరు రైతుల వినతి

**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 20 ( నంది పత్రిక )** నంద్యాల మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ని గోస్పాడు మండలం యాలూరు గ్రామానికి చెందిన రైతులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కేసీ కెనాల్ ఆయకట్టు కింద ముమ్మరంగా పంటల సాగు చేపట్టామని , ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల వల్ల తక్కువ కాలపరిమితి పంటలు (సుమారు 100 రోజులు) వేయడం జరిగిందని, ఇవి అక్టోబర్ మొదటి వారం (రబీ) నుంచి సాగు దశకు వస్తాయని తెలిపారు. ఈ పంటలకు మరో 2 తడుల నీరు అందితే చేతికి అందుతాయని వివరించారు. ప్రధానంగా మినుము, జొన్న పంటలు సాగు చేశామని, ముఖ్యంగా జొన్న పంట పశుగ్రాసానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకొచ్చారు. కావున ప్రస్తుత ఖరీఫ్ పంటలు పూర్తిగా చేతికి వచ్చేందుకు అక్టోబర్ నెలాఖరు వరకు కేసీ కెనాల్ ద్వారా సాగునీటిని నిరంతరాయంగా కొనసాగించేలా సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని రైతులు విజ్ఞప్తి చేశారు.రైతుల సమస్యలను సావధానంగా విన్న మంత్రి ఎన్ఎండి ఫరూక్ సానుకూలంగా స్పందిస్తూ ఎలినో ప్రభావం వల్ల నీటి ఇబ్బంది చాలా ఉందని , నీటిపారుదల శాఖ (ఇరిగేషన్) అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు . ఈ కార్యక్రమంలో గోస్పాడు మండలం యాలూరు గ్రామానికి చెందిన ఆయకట్టు రైతులు, తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి కుప్పం పర్యటన విజయవంతానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి





## ఏఎస్ఎల్ (ముందస్తు భద్రత లైజాన్)లో భాగంగా పర్యటన ప్రాంతాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ తుషార్ డూడి

**కుప్పం, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 20: నంది పత్రిక** రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఈ నెల 21వ తేదీ నుండి 22 తేదీ వరకు కుప్పం నియోజకవర్గంలో రెండు రోజుల పాటు పర్యటించనున్న నేపథ్యంలో, ఏఎస్ఎల్ (ూఎఝుఅషవస ూవఎబతీ్ఎ ూఝుఅంశీఅ)లో భాగంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఐఏఎస్, జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం నాయుడు, ముఖ్యమంత్రి పర్యటన లైసెన్ ఆఫీసర్ పి వెంకటేష్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, కుప్పం రైల్వే స్టేషన్ సూపర్డెంట్ తో కలిసి ఆదివారం పర్యటనకు సంబంధించిన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తుంసి ఎలిప్యాడ్

శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి చేరుకుంటారు. అక్కడ హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ జలహారతి స్థలాన్ని పరిశీలించారు. కుప్పం నియోజకవర్గంలో రైతు బజార్‌కు శంకుస్థాపన స్థలాన్ని పరిశీలించారు.సహా కుప్పం మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేస్తారు. రూ.289.5 కోట్ల విలువైన పనులు ప్రారంభించుకోవడంతో పాటు...రూ.38.5 కోట్ల విలువైన పనులకు సీఎం శంకుస్థాపనలు చేస్తారు. స్వర్ణ కుప్పం విజయాలను ప్రదర్శించే వీడియోను వీక్షిస్తారు. లబ్ధిదారులతో ముఖ్యమంత్రి ముఖాముఖి మాట్లాడతారు. కుప్పం కొత్తపేటలో నిర్వహించే భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. "స్వర్ణ కుప్పం" అచీవ్‌మెంట్స్ గ్యాలరీని సందర్శిస్తారు. హిందాల్కో ప్రతినిధులతో సమావేశమవుతారు. జాతీయ రహదారి ప్రాజెక్టులపై సమీక్షిస్తారు. ఆరోజు రాత్రి... దాదర్‌పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు కుప్పం రైల్వే స్టేషన్‌లో అదనపు హాల్ట్‌ను స్థలాన్ని పరిశీలించారు. కడపల్లి నందు ముఖ్యమంత్రి పాల్గొన్న కేడర్ మీటింగ్ సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయా స్థలాలను జిల్లా కలెక్టర్ పరిశీలించి జల హారతి నందు, బహిరంగ సభ నందు, ముఖ్యమంత్రి పాల్గొన్న ప్రదేశాలలో పటిష్టమైన భారీకేడ్లు, రైల్వే స్టేషన్ నందు భద్రత చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

జిల్లా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లను అత్యున్నత ప్రమాణాలతో అమలు చేయడంతో పాటు ట్రాఫిక్ నిర్వహణ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. భద్రతా విభాగం జారీ చేసే సూచనలను ప్రతి శాఖ తప్పనిసరిగా పాటించి సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలోపీకేఎం యూడీఏ చైర్మన్ సురేష్ బాబు వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, బెంగళూరు జోన్ కు సంబంధించిన రైల్వే అధికారులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# ఘనంగా వినాయక చవితి పండుగ

## వినాయక చవితి ఉత్సవాల్లో ఎమ్మెల్యే గద్దె రామమోహన్



**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 20 నంది పత్రిక** తూర్పు నియోజకవర్గ పరిధిలోని పటమట చిన్న వంతెన సెంటర్, డీమార్ట్ సెంటర్, బృందావన్ కాలనీ, కృష్ణలంక తదితర ప్రాంతాల్లో ఆదివారం జరిగిన వినాయక చవితి ఉత్సవాల్లో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పాల్గొన్నారు. వినాయక విగ్రహాలను దర్శించుకుని, అక్కడ జరుగుతున్న పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ తెలుగు వారి సంస్కృతి, సాంప్రదాయాలకు పండుగలు ప్రతీకలు అని అన్నారు. వినాయక చవితి అంటే ప్రకృతి పండుగ అని చెప్పారు. మట్టితో వినాయక ప్రతిమలను తయారు చేసి ప్రకృతిలో లభించే 21 రకాల ఆకులతో వినాయకుడిని పూజించడమే వినాయక చవితి అన్నారు. అంత పవిత్రమైన పండుగను ఘనంగా జరుపుకోవాలనే ఉద్దేశ్యంతో తమ కూటమి ప్రభుత్వం వినాయక చవితి మండపాలకు ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేయాలని గొప్ప నిర్ణయాన్ని తీసుకుందని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. అన్ని చొట్లా స్థానిక టీడీపీ నాయకులతో పాటుగా వినాయకచవితి మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.ముమ్మనేని ప్రసాద్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వంలో నారా చంద్రబాబునాయుడికి వ్యతిరేకంగా చేసిన కుట్రలపై స్పందించి ఈప్రాంత వాసులు నారా చంద్రబాబునాయుడికి స్వచ్ఛందంగా బయటకు వచ్చి మద్దతు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో నూతి శ్రీను, ముమ్మనేని ప్రసాద్, గద్దె ప్రసాద్, కొర్రపాటి శ్రీను, కూరపాటి కోటంరాజు, మాదిరెడ్డి రవికిరణ్, షేక్ నాగూర్, హేమంతు, రవి, శొంఠి నాగేశ్వరరావు, లోకేశ్వరరావు, సబినేని పసి, మోహన్‌రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



# జేడీ టవర్స్ భూమి 22ఏ జాబితా నుంచి తొలగింపు





## ఆనందోత్సాహాల్లో జేడీ టవర్స్ నివాసితులు ప్రజాదర్బార్ వల్లనే ఈ సమస్య పరిష్కరించగలిగాం గద్దె రామమోహన్

**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 20 నంది పత్రిక** ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి కూర్చొని చర్చించుకోవడం ద్వారా ఎంతటి పెద్ద సమస్యనైనా పరిష్కరించుకోవచ్చునని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. అందుకు నిదర్శనమే 22ఏ భూముల జాబితాలో ఉన్న జేడీ టవర్స్ ప్రాంతాన్ని ఆ జాబితా నుంచి తొలగించడమేనని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ వల్లనే ఈ సమస్యను పరిష్కారం అయ్యిందని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. ఆదివారం ఉదయం 13వ డివిజన్ జేడీ నగర్‌లోని జేడీ టవర్స్ ఏరియాలో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పర్యటించారు. స్థానికంగా ఉన్న వారితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేడీటవర్స్‌లో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాల్లో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పాల్గొని వినాయక విగ్రహాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే అంటే పోస్ట్ మ్యాన్ మాదిరిగా భావించాలని, అప్పుడే ప్రజలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే సేవలు, సంక్షేమాన్ని ప్రజలకు చేరవేసే మధ్యవర్తిగా నాయకులు ఉండాలని అప్పుడే ప్రజలకు నాయకులపై అభిమానం, ఆదరణ పెరిగి ఎన్నికల్లో విజయం సాధించగలుగుతారని చెప్పారు. తాను గన్నవరం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు, ఢిల్లీలో ఎంపీగా ఉన్నపుడు, ప్రస్తుతం తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా తాను ఎల్లప్పుడు ప్రజలతోనే ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని, పరిష్కరించడమే లక్ష్యంగా నిర్ణయించుకున్నానని చెప్పారు. ప్రజల ప్రతి సమస్యను పరిష్కరించడమే నాయకుల లక్ష్యంగా ఉండాలని ఆనాడు ఎన్టీఆర్, నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పారన్నారు. అదే ఉద్దేశ్యంతో ఏపీఐఐసీ కాలనీలో సుమారు రూ.200 కోట్ల విలువైన కామన్ సైట్ సమస్యను తమ ప్రభుత్వం పరిష్కరించిందని తెలిపారు. గతంలో ప్రభుత్వం చేసిన చిన్న తప్పిదాన్ని తమ ప్రభుత్వం సరిచేసి కాలనీలోని ఇళ్ళ యజమానులకు మేలు చేసిందన్నారు. ఇప్పుడు ఒకొక్క ఇంటి వారికి సుమారు 50 గజాల స్థలం వారికి సొంతం అయ్యిందన్నారు. క్యాబినెట్‌లో మంత్రులు అందరితో చర్చించి ఏపీఐఐసీ కాలనీలోని కామన్ సైట్ సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చొరవతోనే ఈ సమస్య పరిష్కారం అయ్యిందన్నారు. అదే విధంగా ఇప్పుడు జేడీనగర్‌లోని జేడీ టవర్స్ ఉన్న ప్రాంతాన్ని 22ఏ జాబితాలో గతంలో చేర్చారని చెప్పారు. ప్రజాదర్బార్‌లో ఈ విషయాన్ని స్థానికులు తనకు తెలియజేసిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి ఈ విషయాన్ని తెలియజేశామన్నారు. అలా ఎందుకు జరిగిందనే విషయంపై రెవెన్యూ అధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ విచారణ జరిపించారన్నారు. 22ఏ జాబితాలో ఉండటం వల్ల స్థానికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల ఈ భూములను 22ఏ జాబితా నుంచి తొలగించేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఈ జేడి టవర్స్ ఉన్న ప్రాంతాన్ని 22ఏ జాబితా నుంచి తొలగించడంతో ఈ ప్రాంత వాసులు చాలా ఆనందంగా ఉన్నారన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొనేందుకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని, ఆ ప్రజాదర్బార్‌లో తెలియజేసిన ఈ జేడీ టవర్ వాసులు సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. పబ్లిక్, ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా ఉంటే ఎంత పెద్ద సమస్య అయినా పరిష్కరించుకోవచ్చునని చెప్పారు. జేడీ టవర్ వాసుల సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లకు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. –స్థానిక మాజీ కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. జెడి టవర్స్ లో నివసిస్తున్నవారు ఈ ప్రాంతాన్ని 22ఎలో చేర్చడం వల్ల ఎంత ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్య పరిష్కారం కావడంతో వారంతా చాలా సంతోషపడుతున్నారని చెప్పుకొచ్చారు. జెడి టవర్స్ వాసుల తరపున కూడా ఆయన శాసనసభ్యులు గద్దె రామమోహన్ ధన్యవాదాలు తెలియజేశారు. గత ప్రభుత్వంలో నారా చంద్రబాబునాయుడికి వ్యతిరేకంగా చేసిన కుట్రలపై స్పందించి ఈప్రాంత వాసులు నారా చంద్రబాబునాయుడికి స్వచ్ఛందంగా బయటకు వచ్చి మద్దతు తెలిపారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నూతి శ్రీను, ముమ్మనేని ప్రసాద్, గద్దె ప్రసాద్, కొర్రపాటి శ్రీను, కూరపాటి కోటంరాజు, మాదిరెడ్డి రవికిరణ్, షేక్ నాగూర్, హేమంతు, రవి, శొంఠి నాగేశ్వరరావు, లోకేశ్వరరావు, సబ్బినేని పసి, మోహన్‌రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# ఖర్చెంతైనా బాధ్యత నాదే..

## - రహీమున్నీసా బేగం ఆరోగ్యానికి ఎమ్మెల్యే నాయిని భరోసా.

## - జీవితం మొత్తం కుటుంబం కంటే సమాజం కోసం పాటుపడిన ఉద్యమకారిణికి అండగా ఉంటానని హామీ.

ఉద్యమ సమయంలో ప్రజల కోసం, సమాజం కోసం ముందుండి పోరాడిన ఉద్యమకారిణి రహీమున్నీసా బేగం అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు ఆమెను పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఊపిరితిత్తుల సమస్యతో హనుమకొండలోని ఏకశిలా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రహీమున్నీసా బేగం ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరారు.ఈ సందర్భంగా చికిత్సకు ఖర్చెంతైనా పర్వాలేదు.. మెరుగైన వైద్యం అందించడం మన బాధ్యత. రహీమున్నీసా బేగం ఆరోగ్యం కోసం అవసరమైన సహాయం అందిస్తాను అని ఎమ్మెల్యే నాయిని భరోసా ఇచ్చారు.తన జీవితాన్ని కుటుంబం కంటే సమాజానికి, ప్రజల కోసం అంకితం చేసిన రహీమున్నీసా బేగం వంటి ఉద్యమకారిణి కష్టకాలంలో ఒంటరిగా ఉండకూడదనే ఉద్దేశంతో ఎమ్మెల్యే నాయిని ఆమె కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు. మీ కుటుంబానికి నేను ఉన్నాను.. ధైర్యంగా ఉండండి అంటూ వారికి భరోసా కల్పించారు. రహీమున్నీసా బేగం త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆకాంక్షించారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

21 సోమవారం సెప్టెంబర్ 202

## శ్రీ శివ రామాంజనేయ ఆలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ



మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం,జల్‌పల్లి సర్కిల్-17 పరిది లోని జల్‌పల్లి గ్రామంలో శ్రీ శివ రామాంజనేయ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్య ంలోని గణేష్ మండపంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిం చారు.కొండాపురం కరుణాకర్ యాదవ్,ఆయన కుమారుడు కాంతి కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి,అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సూర్ రెడ్డి జంగారెడ్డి, గొరిగే మల్లేష్,యంజాల మహేందర్,దూడల బాలరాజ్ గౌడ్, ఎస్. సత్తిరెడ్డి, ఎస్. నాగోల్ రెడ్డి,ఆర్.బాలయ్య,పోలేమోని జంగయ్య, ఎస్. గోపాల్ రెడ్డి, ఎస్. వినయ్ రెడ్డి, వై. దేవేందర్, గొరిగే శ్రీకాంత్,డి.శివ గౌడ్, జామ రాజు, వై.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ పూజారి,భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి




కోదాడ సీసీరెడ్డి కాన్వెంట్ ప్రాంగణ ంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా ను అద్భుతంగా విజయ వంతం చేసిన కాంగ్రెస్ శ్రేణులకు , ప్రజా ప్రతినిధులకు, పాత్రికే యులకు ప్రతి ఒక్కరికి నాతరుపున పేరు పేరునా హృదయపూర్వక కృత జ్ఞతలు తెలియ చేసిన కోదాడ ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి రెడ్డి. మెగా జాబ్ మేళా లో కీలక పాత్ర పోషించి కార్యక్రమం విజయవంతానికి అహర్నిశలు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ,బ్లాక్ ,మండల ,పట్టణ ,గ్రామ ,వార్డు అధ్య క్షులు, ఆయా కమిటీల బాధ్యులు,మార్కెట్ కమిటీ చైర్మన్లు ,వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు ,మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు కౌన్సిలర్లు సింగిల్ విండో చైర్మన్లు ,వైస్ చైర్మన్లు ,డైరెక్టర్లు సర్పంచ్ లు ,వార్డు మెంబర్లు ,కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల బాధ్యులు ,మహిళా కమిటీ బాధ్యులు,యూత్ కమిటీ బాధ్యులు ఎన్ ఎస్ యు ఐకమిటీ బాధ్యులు ,సోషల్ మీడియా కోఆర్డినేటర్లు, శ్రేయోబి. లాషులు, మిత్రులు ప్రతి ఒక్కరికీ పేరు పేరున ధన్యవాదాలు తెలియజేసిన కోదాడ శాసన సభ్యురాలు పద్మావతి రెడ్డి

# తెలంగాణ పోలీస్ అకాడమీలో బీహార్ పోలీసులకు చెందిన 54 మంది డీఎస్పీలకు విజయవంతమైన శిక్షణా కార్యక్రమం







జ్ఞాన మార్పిడి ద్వారా శాంతిభద్రతల అమలును బలోపేతం చేయడం! బీహార్ పోలీసులకు చెందిన 54 మంది డీఎస్పీల కోసం నిర్వహించిన 6 రోజుల విజయవంతమైన ఇన్-సర్వీస్ శిక్షణ కార్యక్రమం ఈరోజు ఆర్.బి.వి.ఆర్.ఆర్ తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో ముగిసింది. తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమం, అత్యాధునిక పోలీసింగ్ పద్ధతులు మరియు సాంకేతిక పురోగతులపై దృష్టి సారించింది.ఈ సందర్భంగా టీజీపీఏ డైరెక్టర్ మాట్లాడుతూ, వివిధ రాష్ట్రాల పోలీసు అధికారుల మధ్య అనుభవాల మార్పిడి, పోలీసింగ్‌లో ఉత్తమ పద్ధతులను పంచుకోవడానికి ఒక అవకాశాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. ఆధునిక పోలీసింగ్‌లో కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థ వంతంగా ఉపయోగించడంతో పాటు, ప్రజలతో మంచి సంబంధాలు, మానవతా దృక్పథం మరియు వృత్తిపరమైన నైతిక విలువలు చాలా కీలకమని ఆమె అన్నారు.ఈ అధ్యయన పర్యటనలోని ముఖ్యాం శాలలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (TGCSB): అధునాతన సైబర్ క్రైమ్ దర్యాప్తు మరియు డిజిటల్ ఫోరెన్సిక్స్, ఈగిల్ (TGANB): ఇంటెలిజెన్స్ ఆధారిత కార్యకలాపాలు మరియు మాదకద్రవ్యాల నియంత్రణ వ్యూహాలు, కమాండ్ c కంట్రోల్ సెంటర్లు: టెక్నాలజీ ఆధారిత ప్రజా పర్యవేక్షణ మరియు ప్రత్యేక కార్యాచరణ వ్యూహాలు వంటి వివిధ విభాగాలను సందర్శించడం జరిగింది. భరోసా కేంద్రాలు c షీ టీమ్‌లు: మహిళలు మరియు పిల్లల భద్రతలో ఉత్తమ పద్ధతులు. ఇలాంటి రాష్ట్రాల మధ్య సహకారాలు భారతదేశం అంతటా మరింత స్మార్ట్, టెక్నాలజీ ఆధారిత, పౌర-స్నేహపూర్వక పోలీసింగ్‌కు మార్గం సుగమం చేస్తాయి!

# ఓంకార్ యూత్ ఆధ్వర్యంలో గణనాధుని కళ్యాణం







భువనగిరి పట్టణం లోని స్థానిక ఓంకార్ ఆశ్రమం వద్ద గణనాధుని కళ్యాణం ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా స్వామి వారి కళ్యాణంలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డ్ కౌన్సిలర్ గుర్రాల సంతోష్ శ్రీనివాస్ గుర్రాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిగా గ్రంధాలయం సంస్థ చైర్మన్ అవేస్ చిస్తీ,హీరకర్ రమేష్ పట్టణ అధ్య క్షులు కూర వెంకటేష్ వార్డ్ సభ్య లయూత్ సభ్యులు పాల్గున్నారు.

## ప్రధాని మోదీ జన్మదిన వేడుకల సందర్భంగా బీజేవైఎం ఆధ్వర్యం లో రక్తదాన శిబిరం




భారత ప్రధానమంత్రినరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా యువ మోర్చా భువనగిరి పట్టణం ఆధ్వర్యంలో, బీజేవైఎం భువనగిరి పట్టణ అధ్య క్షుడు మామిడోజు పవన్ కుమార్ నేతృత్వంలో భువనగిరి పట్టణం లోని ఎస్ ఎస్ ఆర్ కాలేజీ,బస్ స్టాండ్ సమీపంలో రక్తదాన శిబిరా న్ని ఘనంగా నిర్వహించారు.ఈ రక్తదాన శిబిరంలో 76 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రజా సేవలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించారు.బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ మాట్లా డుతూ… ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరి ంచుకుని బీజేవైఎం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహి ంచడం అభినంద నీయమన్నారు.రక్తం అవసరమైన సమయంలో రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణా లను కాపాడవచ్చని తెలిపారు. యువత పెద్ద సంఖ్యలో రక్తదానా నికి ముందుకు రావడం సంతోషకర రమని అన్నారు.మామిడోజు పవన్ కుమార్ మాట్లాడుతూ.ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ జన్మదినా న్ని పురస్కరించుకుని ప్రజా సేవ లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వ హించడం ఎంతో సంతోషంగా ఉం ది.రక్తం అవసరమైన సమయం లో ఒక యూనిట్ రక్తం ఒక ప్రాణా న్ని కాపాడగలదు. అందుకే యువ తరక్తదానానికి ముందుకురావాలి. 76 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ఎంతో అభినం దనీయమైన విషయం.రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ నా హృదయ పూర్వక ధన్యవాదాలు. రాజకీ య కార్యక్రమాలతో పాటు ప్రజలకు ఉపయో గపడే సేవా కార్యక్రమాలకు బీజేవైఎం ఎల్లప్పు డూ ముందు ంటుంది. భవిష్యత్తులో కూడా భువనగిరి పట్టణంలో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వ హిస్తాం. రక్తదానం మహాదానం. మనంఇచ్చే రక్తం మరొకరి జీవితానికి ఆశాకి రణంగా మారుతుంది. యువత సేవా కార్యక్రమాల్లో మరింతగా భాగస్వా ములు కావాలి అని మా మిడోజు పవన్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్య క్షుడు పాశం భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాయ దశరథ,జిల్లా ఉపాధ్యక్షుడు పట్నం శ్రీనివాస్,రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పద్మతి,జగన్మో హన్ రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షు డు దయ్యాల కుమార్ ర్,భువనగిరి పట్టణ బీజేపీ అధ్యక్షుడు రత్నపు రం బలరాం,కౌన్సిలర్లు బందారి స్వర్ణలత,యాస్మి, నల్ల మాస వెంక టేశ్వర్లు, మహిళా మోర్చా అధ్యక్షు రాలు మాధురి చంద్ర,ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడు గాయపాక పృథ్వీ,పట్టణ ప్రధాన కార్యదర్శి ఉడుత భాస్కర్, కృష్ణాచారి, సుర్వి శ్రీనివాస్,రమేష్ కోటి, డా.జె.భరత్ బట్టు క్రాంతి,రత్నపురం ప్రవీణ్, బొల్లారం మధు,రావుల సంతు తదితరులు పాల్గొన్నారు.

## సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో కోదాడ విద్యావంతులు




హైద్రాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ బీసీ . ఉద్యమ కారుడు,. ప్రముఖ రచయిత జూలూరు గౌరీశంకర్ సంకలనం చేసిన వెనుకబడ్డకులాలు ,వెంటాడేకలాలు గ్రంథ సిల్వర్ జూబ్లీ ఉత్సవ సభలో పాల్గొన్న గింజల రమణా రెడ్డి,జిల్లవెంకట్, ఎండి ఖలీల్, ఆజామ్, వట్టికూటి చలపతి, రఫీక్. ఇతర మిత్రులు పాల్గొన్నారు అనంతరము నడిగూడెం వాసి జూలూరు గౌరీ శంకర్ను సన్మానించారు.

## ఎస్ ఐ ని సన్మానించిన పెయింటర్ యూనియన్ నాయకులు



ఇటీవల నూతనంగా ఎన్నికైన నడిగూడెం మండల పెయింటర్ యూని యన్ సభ్యులు మండల ఎస్సై తేజస్విని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఎస్ఐ మాట్లాడుతూ యూనియన్ సభ్యులు హౌసింగ్ పెయింటింగ్ వేసే సమయంలో జాగ్రత్తలు పాటిం చాలని సూచించారు ఈ కార్యక్రమంలో నడిగూడెం మండల హౌస్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధ సంస్థ యూ నియన్ కార్యవర్గ సభ్యులు. అధ్యక్షులు :గంటెపంగు సైదులు. ఉపాధ్య క్షులు నోసిన రవి ప్రధాన కార్యదర్శి సీమ సుధాకర్ కోశాధికారి చిలక భాస్కర్ సహాయ కార్యదర్శులు కొండూరు యాదాద్రి దాసరి నాగేష్ అట్లాగే తమ్మి కార్యవర్గ సభ్యులు దాసరి నరేష్ సీమ యాకోబు ఎస్కే పాష అట్లాగే స్వామి గెంటపంగు రమేష్ నాగేశ్వరరావు చాందు. అశోక్ నూసిన రఘు తదితరులు పాల్గొన్నారు.

## శివపుత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా కుంకుమార్చన, అన్న సమారాధన కార్యక్రమం



కూకట్ పల్లి ఆల్విన్ కాలనీ వెంకటేష్ నగర్ లో వినాయక చవితి సందర్భంగా శివపుత్ర యూత్ అసోసియేషన్ సభ్యుల వారిచే ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఆదివారం ఉదయం కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్య లో పాల్గొని పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు, అదేవిధంగా సాయంత్రం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి తీర్థప్రసాదాలు తీసుకొని అన్నా ప్రసాదాన్ని స్వీకరించి కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణపతి హోమం, అన్నప్రసాద వితరణ



ఛత్రినాక మిత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో 59వ వార్షిక గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఉదయం గణపతి హోమం, నైవేద్య సమర్పణ, మహా హారతి ఘనంగా నిర్వహించారు.ఈ సంద ర్భంగా అన్నప్రసాద వితరణ ఏర్పాటుకు సహకరించిన టి.రవి కిరణ్ కమిటీ తరపున శాలువ కప్పి సన్మానించారు.ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.పి.క్రాంతి కుమార్, సంఘం ప్రతినిధులు కె.భర ద్వాజ, బి.వరుణ్ కుమార్, బి.నితిన్ చారి, బి.విఘ్నేశ్వర్, వెంకటేష్, కోటేశ్, మధుసూదన్, ఎస్.కరణ్, ఐ.రాహుల్, సంతోష్, కె.సరోజ్, సి.సుధాకర్, బి.వినీత్ చారి, రఘు సాయిరాం, సుశీలత్, రిషి తదిత రులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. దాదాపు 500 మంది భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఈసారీ కుల లెక్కలు గట్టెక్కలేవా?



జరిగిన ఘటనలను పునరావృతం చేయాలని చాలా మంది అనుకుంటారు. ఆశించినట్లుగా వాటిని పునరావృతం చేయలేరు. అయినా ప్రయత్నాలను ఆపరు. మానవ ప్రవర్తనలో దీన్ని సహజమే అనుకోవచ్చు. వైఫల్యాలను పునరావృతం చేయాలని మనం ఎవ్వరమూ అనుకోం. కానీ కులాల లెక్కింపు విషయంలో మాత్రం ఇప్పుడు ఆ ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటివరకూ అనధికారికంగా వెల్లడైన సమాచారాన్ని పరిశీలిస్తే దీన్నంత తేలికగా కొట్టేయలేం. దేశంలో మంచు అధికంగా ఉండే ప్రాంతాల్లో రెండో దశ జనాభా లెక్కల ప్రక్రియ త్వరలో ప్రారంభం అవుతోంది. అక్కడ జనాభా సంఖ్యతో పాటు ఏ కులానికి చెందిన ప్రజలు ఎందరున్నారన్న సమాచారాన్ని కూడా సేకరించాలి. సెప్టెంబరు ఒకటి నుంచి లద్దాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో కొన్ని ప్రాంతాల్లో ఇది జరగాలి. దాదాపు 15 రోజుల సమయమే ఇంకా మిగిలి ఉంది. ఇంతవరకూ కులాల సమాచారాన్ని ఏ విధంగా సేకరిస్తారన్న విషయాన్ని స్పష్టంచేస్తూ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. గతంలో ఎప్పుడూ ఇంత జాప్యం జరగలేదు. బహుశా ప్రక్రియ ప్రారంభానికి ముందు చాలా తక్కువ వ్యవధిలో దాన్ని జారీచేస్తే వివాదాలను బాగా పరిమితం చేయగలమన్న ఉద్దేశమే దానికి కారణం కావొచ్చు. నోటిఫికేషన్ ఆలస్యం చేస్తున్నా జనాభాగణనలో పాల్గొనే సిబ్బందికి వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వటం దాదాపుగా పూర్తయింది. శిక్షణ సందర్భంగా ఒక విషయాన్ని స్పష్టంచేశారు. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల (ఎస్సీ, ఎస్టీ) విషయంలో గతంలో చేసినట్టే ఆయా కులాల, తెగల సమాచారాన్ని సేకరిస్తారు. అంటే కేంద్ర ప్రభుత్వం గుర్తించిన రాష్ట్రాల వారీ ఎస్సీ, ఎస్టీ జాబితాను అనుసరించి ఎవరు ఏ కులానికి చెందితే అక్కడ వారి సమాచారాన్ని నమోదుచేస్తారు. తాము ఎస్సీ వర్గానికి చెందినవారమని ఒక కుటుంబం చెబితే ఆ వర్గంలో ఏ కులమో తెలుసుకుని ఫాంలో సంబంధిత బ్రాకెట్‌లో టిక్కు పెట్టుకుంటారు. ఎస్టీల విషయంలోనూ అదే చేస్తారు. మరి వెనుకబడిన కులాల (బీసీలు) విషయంలో దీన్నే చేస్తారా అంటే? ఇప్పటివరకూ వస్తున్న సమాచారం ప్రకారం అలా చేసే అవకాశం కనపడటం లేదు. కేంద్ర జాబితాలో బీసీ కులాల సంఖ్యకు, రాష్ట్రాల జాబితాలోని బీసీ కులాల సంఖ్యకు చాలా తేడా ఉంది. ఉదాహరణకు తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం 133 కులాలను బీసీలుగా గుర్తిస్తే కేంద్ర జాబితాలో 90 కులాలు మాత్రమే ఉన్నాయి. మహారాష్ట్ర ప్రభుత్వం 346 కులాలను బీసీలుగా గుర్తిస్తే కేంద్రం మాత్రం 261నే పరిగణనలోకి తీసుకుంది. కాబట్టి తన జాబితా ప్రకారం బీసీల జనాభాను కులాల వారీగా గుర్తించటానికి కేంద్రానికి ఇబ్బందులు ఉన్నాయి. ఒకవేళ అలా చేస్తే కొన్ని వందల కులాలు ఆ జాబితాకు బయటే ఉండిపోతాయి. పోనీ రాష్ట్రాల వారీ బీసీల జాబితాను పరిగణనలోకి తీసుకుని వాటి ప్రకారం విడివిడి కులాల జనాభా లెక్కలను సేకరిస్తే వాళ్లందరినీ కేంద్ర బీసీ జాబితాలో చేర్చాలనే డిమాండు వెంటనే ఊపందుకుంటుంది. దాన్ని ఎదుర్కొని సమస్యను పరిష్కరించటానికి కేంద్రం సిద్ధంగా లేదు. బీసీల వర్గీకరణకు ఏర్పాటుచేసిన జస్టిస్ రోహిణి కమిషన్ ఇచ్చిన నివేదికకే ఇంతవరకూ అతీగతీ లేదు. 2017లో ఏర్పాటైన ఆ కమిషన్‌కు నివేదిక ఇవ్వటానికే ఆరేళ్లు పట్టింది. దాని సిఫార్సులు ఏమిటో ఇప్పటికీ బయటపెట్టలేదు. రిజర్వేషన్లకు బయట ఉన్న కులాలన్నిటినీ అగ్రకులాలే అనుకుంటే అవన్నీ వివిధ రాష్ట్రాల్లో వేర్వేరు పేర్లతో ఉన్నాయి. అక్కడి ఎస్సీ, ఎస్టీ, బీసీ జాబితాలను పరిగణనలోకి తీసుకుని ప్రతి రాష్ట్రానికి నిర్దిష్టంగా అగ్రకుల జాబితానో, నాన్ రిజర్వేషన్ కేటగిరీ జాబితానో రూపొందించాలి. దీనికి కేంద్రం ఆమోదముద్ర వేయాలి.

# ఏఐతో ముప్పు మన జ్ఞానానికి కాదు..!


మనిషికి ఒక గొప్ప చెత్త లక్షణం ఉంది. తను ఒకటి సృష్టిస్తాడు. దానికే భయపడతాడు. దాన్ని నిర్మూలించాలనుకుంటాడు. దానికే బానిసవుతాడు. మనిషిది విజయాల చరిత్ర కాదు. భయాల చరిత్ర. నిప్పును, యంత్రాన్ని, కరెంటును, టెలిఫోన్‌ను, కంప్యూటర్‌ను, మొబైల్ ఫోన్‌ను, రోబోను చూసి భయపడ్డాడు. ఇప్పుడు ఏఐని చూసి భయపడుతున్నాడు. ప్రతి కొత్త ఆవిష్కరణ మనిషిని అనివార్యంగా అభద్రతలోకే నెట్టింది. ఇది వచ్చాక నేను ఏమవుతాను? అని ప్రతిసారీ మనిషి భయం. కానీ విచిత్రమేమిటంటే కొన్ని వేల సంవత్సరాలుగా ఆ ప్రశ్న పదే పదే అడుగుతూనే మనిషి ఇంకా అదే వలయంలో చిక్కుకున్నాడు. మారింది అతని పని, పనిముట్టు, వేగం, జీవన విధానం. కానీ మనిషి ఏ దశలోనూ ధ్వంసం కాలేదు. ముద్రణ యంత్రం, రైలు, విద్యుత్తు, ఫోటోగ్రఫీ, సినిమా, ఏటీఎం, ఇంటర్నెట్, గూగుల్, స్మార్ట్ ఫోన్, ఏఐ వరకూ ప్రతి దశలో అదే భయం. ఏఐ గురించిన చాలా భయాలు మనకు వినపడుతున్నాయి. అయితే, అనవసరంగా తీవ్రంగా భయపడుతున్నారు. నిజంగా భయపడాల్సిన కోణం అది తాగుతున్న నీరు గురించి. ఏఐ నీటి వాడకం పర్యావరణానికి చేయబోతున్న ముప్పు గురించి. అది సర్వర్లను చల్లబరచడానికి తాగుతున్న నీళ్ల క్వాంటిటీ గురించి భయపడాలి. కొన్ని లక్షల టీఎంసీల నీరు ఏఐ తాగేస్తోందన్నది చాలామందికి తెలియని నిజం. ఆ నీళ్లు లేకుంటే ఏఐ సమాధానాలు చెప్పలేదన్నదీ నిజం. అయితే ఆ నీళ్ల వినియోగం వల్ల వచ్చే ముప్పు ఎంత, దానికి పరిష్కారం ఏమిటి?నిజానికి ఏఐ నీటిని తాగడం సమస్యేనా? మనిషి తాగే నీటినే ఏఐకి ఇవ్వాల్సి వచ్చే విధంగా దాన్ని నిర్మిస్తే అది సమస్య కాదా? సముద్రంలోని ఉప్పు నీటిని ఈ చల్ల బరచడానికి వాడడం సాధ్యమా అనే విషయాల గురించి ఆలోచించాలి. తాగు నీరు కాకుండా, భూజలం కాకుండా ఏ నీటిని సర్వర్ల కోసం వాడాలి అనేది తెలుసుకోవల్సిందీ తేల్చాల్సిందీ మనిషే. సాంకేతికతకు దాహం ఉండదు. దాన్ని ఎక్కడ నిర్మించాలి, ఏ నీటితో చల్లబరచాలి, మనిషి అవసరానికి ఎంత ప్రాధాన్యం ఇవ్వాలి అనేది నిర్ణయించేది మనిషే. అంటే ఏఐ నుంచి వచ్చే ముప్పు కూడా చివరికి ఏఐ తెలివిలో కాదు, మనిషి తీసుకునే తెలివి తక్కువ నిర్ణయాల్లో ఉందనమాట!ఇక ఏఐ గురించిన మనిషి ఇంకో భయం దాని జ్ఞానం. అయితే భయాన్ని జయించడం అంటే దాన్ని నాశనం చేయడం కాదు, అర్థం చేసుకోవడం. నిప్పు మనిషి మొదటి భయం, మొదటి స్నేహితుడు కూడా. మొదట దాన్నుంచి పారిపోయాడు. తర్వాత అర్థం చేసుకున్నాడు. చివరకు అదే నిప్పుతో ఆహారం వండుకున్నాడు, చలిని తరిమాడు, చీకటిని జయించాడు. చక్రం మనిషి కాళ్లకు సవాలుగా వచ్చింది. కానీ కాళ్లను నిరుపయోగం చేయలేదు. చేరలేని దూరాలకు తీసుకెళ్లింది. యంత్రానికి వేగం ఉండొచ్చు, గమ్యం మాత్రం మనిషిదే. పారిశ్రామిక విప్లవంతో యంత్రాలు వచ్చాక ఉద్యోగాలు పోతాయని కార్మికులు భయపడ్డారు. ాబుసుత్వం యంత్రాలను ధ్వంసం చేశారు. వారి భయం యంత్రాల మీద మాత్రమే కాదు. జీవనోపాధి కోల్పోతామన్న ఆందోళన మీద. ఇప్పుడు ఏఐ విషయంలోనూ అదే ప్రశ్న-- మా ఉద్యోగాలేవవుతాయి అని. చరిత్ర చెప్పేది మాత్రం స్పష్టం. కొన్ని పనులు పోతాయి, కొత్త పనులు పుడతాయి. ప్రొక్లెయిన్ వందమంది పని ఒక్క యంత్రంతో చేసింది. కానీ అదే యాంత్రీకరణ రోడ్లు, కాలువలు, ఆనకట్టలు, భారీ నిర్మాణాలను వేగవంతం చేసింది. యంత్రం మనిషిని అవమానించలేదు. అతని కఠిన శ్రమను తగ్గించింది. రాత వచ్చినప్పుడు జ్ఞాపకశక్తి తగ్గిపోతుందని భయపడ్డారు. ఇప్పుడు గూగుల్, స్మార్ట్ ఫోన్, ఏఐ గురించి కూడా అదే భయం. వ్యంగ్యం ఏమిటంటే రాత జ్ఞాపకశక్తిని దెబ్బతీస్తుందని చెప్పిన మాట కూడా మనకు రాత ద్వారానే తెలిసింది. టెలిఫోన్ సంబంధాలను చంపుతుందని అనుకున్నాం. కానీ అది దూరాన్ని చంపింది. కంప్యూటర్ ఉద్యోగాలను మింగేస్తుందని భయపడ్డాం. కొన్ని ఉద్యోగాలు తగ్గాయి, కానీ సాఫ్ట్‌వేర్, డేటా, డిజిటల్ వ్యాపారాల వంటి కొత్త ప్రపంచాలు పుట్టాయి. ప్రతి కొత్త సాంకేతికత ముందూ మనిషి మొదట భయపడ్డాడు. తర్వాత దాన్ని అర్థం చేసుకున్నాడు. చివరకు తన సాధనంగా మార్చుకున్నాడు. ఏఐ కూడా ఆ చరిత్రలో మరో అధ్యాయం మాత్రమే. ఏఐ ఇప్పుడు మన ముందున్న కొత్త భయం. ఇది పాత వస్తువుల కంటే కొంచెం భిన్నంగా కనిపిస్తోంది. ఎందుకంటే పాత యంత్రాలు ప్రధానంగా మనిషి శరీరానికి పోటీ. ఏఐ మాత్రం మనిషి మెదడుకు పోటీ. ఇది మనిషికి కొత్త అనుభవం. అందుకే ఎక్కువ భయం. ఏఐ రచన చేస్తోంది. బొమ్మ గీస్తోంది. సంగీతం స్వరపరుస్తోంది.




కోడ్ రాస్తోంది. భాషలు అనువదిస్తోంది. రోగ నిర్ధారణలో సహాయపడుతోంది. డేటాను విశ్లేషిస్తోంది. మనిషితో సంభాషిస్తోంది. అందుకే ఈసారి ప్రశ్న మరింత భయపెట్టేదిగా ఉంది. యంత్రం ఆలోచించగలిగితే మనిషి ఎందుకు? అనేది తాజా ప్రశ్న. అయితే తెలివి ఒక్కటే మనిషిని మనిషిగా చేయలేదు. ఏఐ సమాధానం తెలుసుకుంటుంది. మనిషికి ప్రశ్న తడుతుంది. ఒక ఏఐ లక్షల పుస్తకాల్లోని సమాచారాన్ని ప్రాసెస్ చేయగలదు. కానీ నేను ఎవరు అని మొదట అడిగింది యంత్రం కాదు, మనిషి. నక్షత్రాలను లెక్కపెట్టే కంప్యూటర్ ఉండొచ్చు. కానీ రాత్రి ఆకాశాన్ని చూసి అక్కడ ఇంకెవరైనా ఉన్నారా? అని ఆశ్చర్యపోయింది మనిషి. ఏఐ చెత్తదో డొక్కుదో ప్రేమ కవిత రాయగలదు. కానీ ప్రేమించిన మనిషి కోసం రాత్రంతా నిద్రపోకుండా ఎదురుచూడదు. విరహగీతం తయారు చేయగలదు. విరహాన్ని అనుభవించదు. సమాచారం అనుభవం కాదు. లెక్కించడం జీవించడం కాదు. సమాధానం చెప్పడం జ్ఞానం కాదు. మరి ఈ కోణంలో ఏఐ ప్రమాదం కాదా? అంటే కాదనలేం. ఏఐతో ఉద్యోగాలు మారవచ్చు. కొన్ని ఉద్యోగాలు తగ్గవచ్చు. నకిలీ సమాచారం, మోసాలు, పర్యవేక్షణ, అధికార కేంద్రీకరణ, సృజనాత్మక హక్కులు వంటి తీవ్రమైన సమస్యలు రావచ్చు. అందువల్ల ఏఐ గురించి ప్రశ్నించాలి. చట్టాలు కావాలి. నైతిక పరిమితులు కావాలి. నియంత్రణ కావాలి. కానీ భయం వల్ల దాన్ని తిరస్కరించడం పరిష్కారం కాదు. ఒకప్పుడు యంత్రాలను పగలగొట్టడం వల్ల పారిశ్రామిక విప్లవం ఆగలేదు. ఏఐని తిడితే ఏఐ ఆగదు. దాన్ని అర్థం చేసుకోవాలి. దాని మీద అధికారం ఎవరిదో ప్రశ్నించాలి. దాని ప్రయోజనాలు కొద్దిమంది కంపెనీలకే కాక సమాజానికి ఎలా అందాలో నిర్ణయించాలి. మనిషి పని పోకుండా మాత్రమే కాదు, మనిషి గౌరవం పోకుండా చూసుకోవాలి. ఎందుకంటే యంత్రానికి ఒక పరిమితి ఉంది. ప్రొక్లెయిన్ కొండను తవ్వగలదు. కానీ ఆ కొండను తవ్వాలా వద్దా అని నిర్ణయించాల్సింది మనిషే. కంప్యూటర్ కోట్ల లెక్కలు చేయగలదు. కానీ ఏ లెక్క న్యాయమైనదో నిర్ణయించాల్సింది మనిషే. రోబో తుపాకీ పేల్చగలదు. కానీ ఎవరి మీద తుపాకీ ఎత్తకూడదో చెప్పాల్సింది మనిషే. ఏఐ ఒక తీర్పుకు అవసరమైన సమాచారాన్ని విశ్లేషించగలదు. కానీ న్యాయం అంటే ఏమిటి? అనే ప్రశ్నకు సమాజం సమాధానం చెప్పాలి. ఇక్కడే మనిషి ఆధిక్యం ఉంది. అది ఐక్యూలో కాదు. వేగంలో కాదు. జ్ఞాపకశక్తిలో కాదు. లెక్కల్లో కాదు. విలువలను సృష్టించగలగడంలో ఉంది. అందుకే ఏఐ యుగంలో మనిషి అడగాల్సిన ప్రశ్న 'ఏఐ మనిషిని మించిపోతుందా?' అని కాదు. ఏఐని ఉపయోగించి మనల్ని మనం ఎంత మెరుగుపరుచుకుంటాం? అన్నది. ఎందుకంటే నిప్పు గొప్పది కాదు. దాన్ని అదుపులోకి తెచ్చిన మనిషి గొప్పవాడు. చక్రం గొప్పది కాదు. దానికి గమ్యం ఇచ్చిన మనిషి గొప్పవాడు. యంత్రం గొప్పది కాదు. దానికి పని చెప్పిన మనిషి గొప్పవాడు. కంప్యూటర్ గొప్పది కాదు. దానికి భాష నేర్పిన మనిషి గొప్పవాడు. ఏఐ శ్రీశ్రీని తయారు చేయలేదు, డావిన్సీని పుట్టించలేదు. మనిషి కంటే తెలివైన యంత్రం ఉంటుంది, మనిషి కంటే గొప్ప యంత్రం ఉండదు. తన తెలివిలోంచి తనకే పోటీ అయ్యే మరో తెలివిని సృష్టించగలిగిన మనిషే గొప్పవాడు. బహుశా మానవ నాగరికత మొత్తాన్ని ఒక్క వాక్యంలో చెప్పాలంటే 'మనిషి ప్రతి కొత్త శక్తిని చూసి మొదట భయపడ్డాడు. తర్వాత దాన్ని తన పనిముట్టుగా మార్చుకున్నాడు' అని చెప్పాలేమో. ఏఐ విషయంలోనూ జరగాల్సింది అదే. ఏఐ మనిషికి ప్రత్యామ్నాయం కావాల్సిన అవసరం లేదు. అది మనిషి చేతిలో మరో పరికరం కావచ్చు. ఎందుకంటే యంత్రానికి తెలివి, వేగం, జ్ఞాపకశక్తి, భాష ఇవ్వగలం. కానీ మనిషి దగ్గర ఉన్న ఒక అత్యంత విలువైన విషయం యంత్రానికి ఇవ్వడం అంత సులభం కాదు. 'నేను ఏం చేయాలి?' అని తనను తాను ప్రశ్నించుకునే నైతిక చైతన్యం మాత్రం ఇవ్వలేం. ఆ ప్రశ్న ఉన్నంతకాలం మనిషి అవసరం తీరదు.

# బిజినెస్

## దేశవ్యాప్త బ్యాంకుల సమ్మె.. ఖాతాదారులకు ఎస్‌బీఐ కీలక సూచన



దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తమ ఖాతాదారులకు ఒక ముఖ్యమైన ప్రకటన జారీ చేసింది. 'యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్' (యూఎఫ్‌బీయూ) పిలుపు మేరకు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు దేశవ్యాప్తంగా బ్యాంకులు సమ్మెకు దిగనున్నాయి. అయితే, దీనికి ముందు సెప్టెంబర్ 26, 27 తేదీలు శని, ఆదివారాలు కావడంతో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకు శాఖలలో ప్రత్యక్ష సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని ఎస్‌బీఐ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమైన బ్యాంకు లావాదేవీలు ఉన్నవారు సమ్మె కంటే ముందే వాటిని పూర్తి చేసుకోవాలని సూచించింది. యూఎఫ్‌బీయూ తమ ఆందోళనలో భాగంగా ఇప్పటికే సెప్టెంబర్ 11న ఒకరోజు సమ్మె నిర్వహించింది. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల చివరలో మరోసారి నిరసనకు సిద్ధమైంది. అంతేకాకుండా అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు కూడా పిలుపునివ్వడంతో బ్యాంకింగ్ రంగంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఎస్‌బీఐ ఈ ముందస్తు సలహాలు జారీ చేసింది.

# అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ మళ్లీ వస్తోంది

# ఎప్పట్నించి అంటే!




పండగ సీజన్ సమీపిస్తుండటంతో ఆన్‌లైన్ షాపింగ్ ప్రియులుఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న "అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2026" తేదీలను ఆ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది అతిపెద్ద సేల్‌గా అభివర్ణిస్తున్న ఈ ఫెస్టివల్ అక్టోబర్ 8 నుంచి ప్రారంభం కానుంది. మరో ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ తన "బిగ్ బిలియన్ డేస్ 2026" సేల్‌ను అక్టోబర్ 9న ప్రారంభించనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో, అమెజాన్ వ్యూహాత్మకంగా ఒక రోజు ముందే తన సేల్‌ను మొదలుపెట్టి పోటీకి సై అంటోంది.

**-భారీ ఆఫర్లు, డిస్కౌంట్లు**

ఈ సేల్‌లో భాగంగా ఎస్‌బీఐ డెబిట్, క్రెడిట్ కార్డులతో కొనుగోళ్లు చేసేవారికి 10% తక్షణ డిస్కౌంట్ లభించనుంది. ఈఎంఐ లావాదేవీలకు కూడా ఈ ఆఫర్ వర్తిస్తుందని అమెజాన్ స్పష్టం చేసింది. ప్రైమ్ మెంబర్లకు కొన్ని ఎంపిక చేసిన ఆఫర్లపై అదనంగా 10% వరకు ప్రయోజనాలు ఉండనున్నాయి. వీటితో పాటు స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, గృహోపకరణాలు, నిత్యావసరాలు వంటి అన్ని కేటగిరీలపై భారీ డిస్కౌంట్లు అందుబాటులో ఉంటాయి. బ్లాక్‌బస్టర్ డీల్స్, టాప్ 100 డీల్స్, మెగా డీల్స్, రాత్రి 8 గంటల డీల్స్ వంటి ప్రత్యేక ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకునేందుకు అమెజాన్ సిద్ధమైంది.

**-టెక్నాలజీ, డెలివరీ నెట్‌వర్క్‌పై ప్రత్యేక దృష్టి**

కేవలం డిస్కౌంట్లే కాకుండా, ఈసారి షాపింగ్ అనుభవాన్ని మెరుగుపరిచేందుకు అమెజాన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఫీచర్లను ప్రవేశపెడుతోంది. వీటి ద్వారా వినియోగదారులు ఉత్పత్తులను సులభంగా పోల్చుకోవచ్చు, ధరల హెచ్చుతగ్గుల చరిత్రను చూడవచ్చు, మెరుగైన సిఫార్సులను పొందవచ్చు.దేశవ్యాప్తంగా వేగవంతమైన డెలివరీని అందించే లక్ష్యంతో తన లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించింది. ఇందులో భాగంగా 20 కొత్త ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు, 6 కొత్త సార్ట్ సెంటర్లు, 150 కొత్త లాస్ట్-మైల్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. దీపావళి నాటికి "అమెజాన్ నౌ" (నిత్యావసరాల క్విక్ కామర్స్) సేవలను 100 నగరాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం తమ ప్లాట్‌ఫామ్‌పై 17 లక్షల మందికి పైగా విక్రయదారులు ఉన్నారని, వీరి సంఖ్య 20 లక్షల మైలురాయిని దాటిందని కంపెనీ పేర్కొంది. సేల్ ఎప్పటివరకు కొనసాగుతుందనే విషయం ఇంకా వెల్లడి కాలేదు. మరిన్ని ఆఫర్ల వివరాలు సేల్ తేదీ దగ్గరపడే కొద్దీ తెలియనున్నాయి.

## టీమిండియాతో ఇంత త్వరగా టీ20 మ్యాచ్.. జపాన్ కోచ్ ఆశ్చర్యం

ప్రపంచ ఛాంపియన్ భారత్‌తో టీ20 మ్యాచ్ ఆడతామనే విషయం నెల రోజుల క్రితం వరకు తమకు కనీసం తెలియదని జపాన్ క్రికెట్ జట్టు హెడ్ కోచ్ డుగాల్ బెడింగ్‌ఫీల్డ్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ఇదొక ఊహించని, అద్భుతమైన అవకాశమని అభివర్ణించాడు. ఇరు దేశాల ప్రధానుల స్థాయిలో జరిగిన ఉన్నతస్థాయి చర్చల తర్వాతే ఈ మ్యాచ్ హఠాత్తుగా ఖరారైందని బెడింగ్‌ఫీల్డ్ వెల్లడించాడు. ఈ చారిత్రక మ్యాచ్ కోసం తమ జట్టు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తోందని తెలిపాడు. మంగళ వారం టోచిగి ప్రిఫెక్చర్‌లోని సానో అంతర్జాతీయ క్రికెట్ గ్రౌండ్‌లో సుజుకి కప్ కోసం భారత్, జపాన్ జట్ల మధ్య ఈ టీ20 మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే ఈ మ్యాచ్ టికెట్లన్నీ అమ్ముడయ్యాయి. మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న ఆసియా క్రీడలకు సన్నాహకంగా ఈ మ్యాచ్ ఉపయోగపడనుంది. ఆసియా క్రీడల్లో శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత జట్టు నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌లో ఆడనుండగా, జపాన్ తన తొలి మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో తలపడనుంది.ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో ప్రత్యేకంగా మాట్లాడుతూ బెడింగ్‌ఫీల్డ్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. "ఈ మ్యాచ్ గురించి విన్నప్పుడు మొదట నమ్మలేకపోయాం. ఇది వందకు వంద శాతం మాకు ఆశ్చర్యం కలిగించింది. ప్రపంచ నంబర్ వన్ జట్టుతో ఆడేందుకు ఇదొక అద్భుతమైన అవకాశం. జపాన్‌లో నివసిస్తున్న భారతీయులు కూడా ఈ మ్యాచ్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మైదానంలో గొప్ప వాతావరణం ఉంటుందని ఆశిస్తున్నాం" అని అన్నాడు.అయితే, జట్టు సన్నద్ధతకు కొన్ని సవాళ్లు ఉన్నాయని బెడింగ్‌ఫీల్డ్ అంగీకరించాడు. "మా ఆటగాళ్లు దేశవిదేశాల్లోని వివిధ ప్రాంతాల్లో ఉంటారు. మే నెల తర్వాత మా పూర్తి జట్టు కలిసి శిక్షణ తీసుకుంది ఇప్పుడే. టెక్నాలజీ సాయంతో ఆటగాళ్లను సమన్వయం చేస్తున్నాం. మరోవైపు, వర్ష సూచన కూడా ఆందోళన కలిగిస్తోంది. అయినా, మ్యాచ్ సజావుగా సాగుతుందని ఆశిస్తున్నాం" అని తెలిపాడు.భారత జట్టు ఫైర్‌పవర్‌ను ఎదుర్కోవడం పెద్ద సవాలని బెడింగ్‌ఫీల్డ్ పేర్కొన్నాడు. "భారత్ వంటి మేటి జట్ల ఆటగాళ్ల విధ్వంసక



శక్తి ముందు కొన్నిసార్లు చిన్న జట్లు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. అయితే, ఈ ఒత్తిడిని అధిగమించి, మైదానంలో గట్టి పోటీ ఇవ్వాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నాం" అని వివరించాడు. 2020లో అండర్-19 ప్రపంచకప్‌లోనూ భారత జట్టుతో తలపడిన అనుభవాన్ని గుర్తుచేసుకున్నాడు. ఆనాడు యశస్వి జైస్వాల్, రవి బిష్ణోయ్ వంటి ఆటగాళ్లున్న భారత జట్టు చేతిలో తమ జట్టు ఓడిపోయిందని, అది గొప్ప అనుభవమని అన్నాడు. ఇప్పుడు సీనియర్ల స్థాయిలో మరోసారి భారత్‌తో ఆడటం ఆసక్తికరంగా ఉందని తెలిపాడు.ఈ మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండా, జపాన్‌లో క్రికెట్‌కు ప్రాచుర్యం కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని బెడింగ్‌ఫీల్డ్ స్పష్టం చేశాడు. "మా ప్రదర్శన ద్వారా జపాన్‌లో భవిష్యత్ తరాల క్రీడాకారులకు స్ఫూర్తినివ్వాలనుకుంటున్నాం. వేలాది మంది పిల్లలు క్రికెట్‌ను తమ క్రీడగా ఎంచుకునేలా చేయడమే మా అంతిమ లక్ష్యం" అని తెలిపాడు. భారత్-జపాన్ దౌత్య సంబంధాల 75 వసంతాల వేడుకలో భాగంగా ఈ మ్యాచ్ ఏర్పాటు చేశారు. సెప్టెంబరు 22న జపాన్ లోని సానో ఇంటర్నేషనల్ గ్రౌండ్ లో ఈ చారిత్రక మ్యాచ్ జరగనుంది.

## ఆసియా క్రీడలు.. భారత్ ఖాతాలో తొలి పతకం

ఆసియా క్రీడల తొలిరోజే భారత్ పతకాల ఖాతా తెరిచింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్లు రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఇలవేనిల్ వలరివన్, సోనమ్ మస్కర్, విదర్శా వినోద్‌లతో కూడిన బృందం చైనా తర్వాత రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. ఈ టోర్నీలో భారత్‌కు ఇదే తొలి పతకం.ఎంఎంఏలో చరిత్ర సృష్టించిన సుచిక మరోవైపు, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఏ)లో సుచిక సెమీఫైనల్‌కు దూసుకెళ్లి చరిత్ర సృష్టించింది. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించడం ద్వారా ఆమె భారత్‌కు ఈ క్రీడలో తొలి పతకాన్ని ఖాయం చేసింది. భారత మహిళల హాకీ జట్టు భారీ విజయంఇక భారత మహిళల హాకీ జట్టు తమ ఆరంభ మ్యాచ్‌లో ప్రభంజనం సృష్టించింది. పూల్ మ్యాచ్‌లో ఉజ్బెకిస్తాన్‌పై ఏకంగా 19-0 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించి తమ ప్రచారాన్ని ఘనంగా ప్రారంభించింది.కొన్ని విభాగాల్లో భారత్‌కు నిరాశ అయితే, కొన్ని విభాగాల్లో భారత్‌కు నిరాశ ఎదురైంది. వుషులో పురుషుల చాంగ్‌క్వాన్ ఫైనల్‌లో సూరజ్ సింగ్ 11వ స్థానంతో సరిపెట్టుకోవడంతో పతకం ఆశలు గల్లంతయ్యాయి. అలాగే, టెక్‌బాల్‌లోనూ భారత్‌కు పతకాలు దక్కలేదు. మహిళల సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్ కాంస్య పతక మ్యాచ్‌లలో భారత క్రీడాకారులు ఓటమి పాలయ్యారు.ఇప్పుడు అందరి దృష్టి



మహిళల క్రికెట్ జట్టుపై ఉంది. గోల్డ్ మెడల్ మ్యాచ్‌లో స్థానం కోసం హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని జట్టు సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌తో తలపడనుంది.

# స్పోర్ట్స్

## షఫాలీ శతక విధ్వంసం.. బంగ్లా బేజారు సూపర్ విక్టరీతో ఫైనల్‌కు భారత్




ఆసియా క్రీడల మహిళల క్రికెట్‌లో భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. యువ ఓపెనర్ షఫాలీ వర్మ ఆకాశమే హద్దుగా చెలరేగి అద్భుత శతకంతో కదం తొక్కడంతో సెమీ ఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై భారత్ 114 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించి, పతకాన్ని ఖాయం చేసుకుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన భారత జట్టు, బంగ్లాదేశ్‌ను చిత్తుగా ఓడించింది.ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధాన బంగ్లా బౌలర్లపై విరుచుకుపడ్డారు. కేవలం 28 బంతుల్లోనే 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలో మంధాన 16 బంతుల్లో 27 పరుగులు చేసి ఔటైనా, పవర్ ప్లే ముగిసేసరికి భారత్ వికెట్ నష్టానికి 72 పరుగులతో పటిష్ఠ స్థితిలో నిలిచింది. మరోవైపు షఫాలీ తన జోరును కొనసాగించింది. కేవలం 24 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకుని బంగ్లా బౌలింగ్‌ను చీల్చి చెండాడింది.అనంతరం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో జతకలిసిన షఫాలీ, మరో కీలక భాగస్వామ్యాన్ని నిర్మించింది. వీరిద్దరూ కలిసి 50 పరుగులకు పైగా జోడించి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఈ క్రమంలో షఫాలీ తన విధ్వంసక ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తూ కేవలం 49 బంతుల్లోనే అజేయ శతకాన్ని పూర్తి చేసుకుంది. ఆమె ఇన్నింగ్స్‌లో 9 భారీ సిక్సర్లు, 3 ఫోర్లు ఉన్నాయి. 204.08 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసిన షఫాలీ చివరి వరకు క్రీజులో నిలిచింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 33 బంతుల్లో 40 పరుగులతో ఆమెకు అండగా నిలవడంతో, భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగుల భారీ స్కోరు సాధించింది. 196 పరుగుల భారీ లక్ష్య ఛేదనతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్, ఆరంభం నుంచే తీవ్ర ఒత్తిడికి గురైంది.


# అప్పట్లో ఆ హీరో పెద్ద సరసాల రాయుడు- జయప్రద



ప్రముఖ నటి జయప్రద తన కెరీర్ తొలినాళ్లలోని ఆసక్తికర జ్ఞాపకాలను పంచుకున్నారు. కపిల్ శర్మ షోకు సంబంధించిన ఓ పాత వీడియో క్లిప్ తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియోలో ఆమె తన సహనటుల గురించి సరదా వ్యాఖ్యలు చేశారు. ఆ రోజుల్లో హీరోలలో అత్యంత సరసాల రాయుడు ఎవరని కపిల్ అడగ్గా, ఆమె నవ్వుతూ “ధర్మేంద్ర” అని సమాధానమిచ్చారు. ఇక సెట్‌కు ఆలస్యంగా వచ్చే హీరో ఎవరనే ప్రశ్నకు, ఆమె రాజేష్ ఖన్నా పేరు చెప్పారు. “నేను దక్షిణాది నుంచి వచ్చాను. అక్కడ ఉదయం 7 గంటలకే సెట్స్‌లో ఉండేదాన్ని. కానీ బాలీవుడ్‌లో 9 గంటలకు రమ్మనేవారు. నేను మేకప్ పూర్తి చేసుకుని సిద్ధంగా ఉన్నా, రాజేష్ ఖన్నా గారు రాత్రి 8 గంటలకు వచ్చేవారు. వచ్చి వడా పావ్ తిని, ఒక షాట్ ఇచ్చి 9 గంటలకు ప్యాకప్ చెప్పేవారు” అని జయప్రద ఆ నాటి పరిస్థితులను వివరించారు. ఆ రోజుల్లో తాను ఎదుర్కొన్న కష్టాల గురించి కూడా జయప్రద మాట్లాడారు. ఒకే రోజులో 5 షిఫ్టులు కూడా పనిచేసేదాన్నని తెలిపారు. “షరాబి” సినిమా షూటింగ్ సమయంలో ఊటీ నుంచి సాయంత్రం రైలెక్కి చెన్నై చేరుకునేదాన్నని, అక్కడి ఎయిర్ పోర్ట్‌లోనే స్నానం చేసి ఫ్లైట్ ఎక్కేదాన్నని గుర్తుచేస ుకున్నారు. విమానంలో ప్రయాణిస్తూనే మేకప్ పూర్తి చేసుకుని కోయంబత్తూరులో షూటింగ్‌కు హాజరయ్యే దాన్నని చెప్పారు. ఇలాంటి పరిస్థితులు కష్టంగా ఉన్నప్పటికీ, గర్వంగా అనిపించేదని ఆమె అన్నారు. దక్షిణాదిలో ఎన్టీఆర్, రాజ్‌కుమార్ వంటి దిగ్గజ హీరోలతో పనిచేసేటప్పుడు తాను కేవలం 16-17 ఏళ్ల అమ్మాయినని, వారితో పనిచేయడం వల్ల ఎంతో క్రమశిక్షణ నేర్చుకున్నానని జయప్రద తెలిపారు.

## ‘కాకా’లో చిరు పాత్ర ఇదే స్వయంగా లీక్ చేసిన మెగాస్టార్!

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న కొత్త చిత్రం ‘కాకా’పై అంచనాలు భారీగా ఉన్నాయి. ‘వాల్తేరు వీరయ్య’ లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరూ కలిసి పనిచేస్తుండటంతో సినిమాపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో మెగాస్టార్ చిరంజీవి స్వయంగా తన పాత్రకు సంబంధించిన కొన్ని కీలక వివరాలను బయటపెట్టారు. ఇటీవల ఓ సినిమా వేడుకకు హాజరైన చిరంజీవి, ‘కాకా’ చిత్రంలో తన పాత్ర గురించి సరదాగా కొన్ని హింట్స్ ఇచ్చారు. ఈ సినిమాలో ఆయన ‘కదిరి కాళిదాస్’ అలియాస్ ‘సత్యం’ అనే రెండు విభిన్న కోణాలున్న పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. పైకి ఓ ఆక్వా ఫ్యాక్టరీలో సూపర్‌వైజర్‌గా పనిచేసే ‘సత్యం’ అనే సాధారణ వ్యక్తిగా కనిపిస్తూనే, తెరవెనుక అండర్‌వాల్డ్‌ను శాసించే ‘కదిరి కాళిదాస్’ అనే మరో శక్తిమంతమైన పాత్రలో ఆయన నటన అబ్బురపరచనుందని సమాచారం.దఈ చిత్రంలో తండ్రీకూతుళ్ల మధ్య సాగే భావోద్వేగభరితమైన కథనం సినిమాకు ప్రాణం పోయనుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. చిరంజీవి కూతురు ‘అమ్ములు’గా మలయాళ నటి అనశ్వర రాజన్ నటిస్తున్నారు. మెడిసిన్ చదివే విద్యార్థిని పాత్రలో ఆమె కనిపించనున్నారు. వీరిద్దరి మధ్య వచ్చే ఎమోషనల్ సన్నివేశాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయని తెలుస్తోంది.



# రష్మిక వైల్డ్ యాక్షన్

# ‘మైసా’ నుంచి పవర్‌ఫుల్ టీజర్




‘నేషనల్ క్రష్’ రష్మిక మందన్న తన సరికొత్త అవతారంతో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న ‘మైసా’ చిత్రం నుంచి విడుదలైన టీజర్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటివరకు గ్లామరస్, క్యూట్ పాత్రలతో అలరించిన రష్మిక, ఈసారి పూర్తి భిన్నంగా ఒక పవర్‌ఫుల్ యాక్షన్ పాత్రలో కనిపించి అందరికీ షాకిచ్చారు. ఈ టీజర్ ప్రస్తుతం యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో ఉంది. ‘మైసా’ టీజర్‌లో రష్మికను ఒక శక్తివంతమైన గోండు గిరిజన మహిళగా చూపించారు. రక్తంతో తడిసిన ముఖం, చేతిలో ఆయుధాలు, తీవ్రమైన పోరాట సన్నివేశాలతో ఆమె లుక్ సినిమాపై అంచనాలను భారీగా పెంచింది. ముఖ్యంగా, “యుద్ధానికి ఆయుధం అంటే భయం కానీ.. ఆయుధం ఏ యుద్ధానికి భయపడదు” అనే డైలాగ్ టీజర్‌కు హైలైట్‌గా నిలిచింది. రష్మిక కెరీర్‌లో ఇది ఒక మేజర్ టర్నింగ్ పాయింట్‌గా నిలుస్తుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రంతో రవీంద్ర పుల్లే దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈయన గతంలో ప్రముఖ దర్శకుడు హను రాఘవపూడి వద్ద సహాయకుడిగా పనిచేశారు. అన్ ఫార్ములా ఫిల్మ్స్ పతాకంపై అనిల్, అజయ్ సయ్యాపురెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టీజర్‌లోని యాక్షన్ సన్నివేశాలకు జేక్స్ బిజోయ్ అందించిన నేపథ్య సంగీతం మరింత ఉత్కంఠను రేకెత్తించింది. రాహుల్ రవీంద్రన్, రావు రమేశ్ వంటి ప్రముఖ నటులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తు న్నారు. ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండి యా స్థాయిలో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ‘మైసా’ చిత్రం 2026, నవంబర్ 27న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com